RNI NO. TELTEL/2022/83470
●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



2లో

## నేడు తిర్మలాపూర్ లో సీఎం సభ సభకు సర్వం సిద్ధం



2లో

## తొక్కిసలాట ఘటనపై ఆర్సీబి విచారం

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 3. సంచిక :264 | శుక్రవారం 06 జూన్ 2025 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in



గురువారం జరిగిన కేబినెట్ సమావేశం వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

- తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ
- మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్వ్యాలిడేషన్ కమిటీలు
- ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా

# ఉద్యోగులకు 2 డీఏలు



అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ హోమ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి

**హైదరాబాద్:,మనసాక్షి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

**ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..**


ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం..

మిగతా 2లో

## నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

- నేటి విచారణకు హాజరు కానున్న ఎంపి ఈటెల
- 9న హరీష్ రావు, 11న కెసిఆర్ విచారణకు హాజరు

2లో



## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



2లో

- ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత సింహాచలం మృతి
- నెలలోపే నంబాల తరవాత మరో అగ్రనేత హతం
- సింహచలంపై కోటి రివార్డు ఉన్నట్లు పోలీసుల ప్రకటన








# నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

**హైదరాబాద్:** తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చింది. వీరిని విచారించేందుకు గురువారం కాళేశ్వరం కమిషన్ హైదరాబాద్ కు చేరుకుంది. విచారణలో భాగంగా శుక్రవారం బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను ప్రశ్నించనుంది. తర్వాత ఈనెల 9న బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు.. 11న మాజి సిఎం కెసిఆర్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి ప్రారంభోత్సవం వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రశ్నల వర్షం కురుపించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-(ఎన్‌డిఎస్ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను శుక్రవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

## తొక్కిసలాట ఘటనపై ఆర్సీబి విచారం



బెంగళూరు: బెంగళూరు తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పరిహారం ప్రకటించింది. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆర్సిబి.. రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు వెల్లడించింది. కాగా, 18ఏళ్ల తర్వాత తొలిసారి ఆర్సీబి జట్టు- కప్ గెలిచిన సందర్భంగా బెంగళూరులో నిన్న విక్టరీ పరేడ్ నిర్వహించారు. అయితే, అభిమానులు భారీగా తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. మరణించినవారిలో ఓ పాపతోపాటు మహిళ కూడా ఉంది. దీంతో ఆర్సీబి విజయోత్సవం తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఉద్యోగులకు 2 డీఏలు



అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది.

ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది.

సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటరియేట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటరియేట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది.

ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

### మరికొన్ని నిర్ణయాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది. హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్%-%1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్%-%2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్%-%3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.

రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యాక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది.

ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



రాయ్‌పూర్: మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు టెంటు లక్ష్మి నరసింహాచలం అలియాస్ గౌతమ్ ఉన్నారు. ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు కీలక మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో విస్తరించిన నేషనల్ పార్క్‌లో కాల్పులు కొనసాగుతున్నాయి. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భారీగా మావోయిస్టులు ఉన్నట్లు- భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి.

ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం ఆయన స్వగ్రామం. కాగా, ఈ ఘటనలో పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.


మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు- లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు. అతడు సుధాకర్‌గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ రామరాజు, సోమన్న అనే మారు పేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ. కోటి రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి -టైగర్ రిజర్వ్‌లో మావోయిస్టు సీనియర్ నేతలు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో.. డీఆర్‌జీ, ఎస్‌టీ-ఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దళాలు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగినట్టు సమాచారం. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. అయితే సుధాకర్ మృతికి సంబంధించి ఎటువంటి ప్రకటను ఆయన జారీ చేయలేదు. బీజాపూర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ-కి చెందిన ముగ్గురు నాయకులను దళాలు ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం. ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ- సీనియర్ లీడర్ పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు- బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లో కార్యకలాపాలను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ ఇతర దాడుల్లో అతడు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. అతడిపై రూ.20లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో అగ్రనేతలను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోలు లొంగిపోయారు. మరోవైపు ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# నేడు తిర్మలాపూర్‌లో సీఎం సభ

## సభకు సర్వం సిద్ధం
## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

**తుర్కపల్లి, జూన్ 05, మన సాక్షి:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గంధమల్ల ప్రాజెక్టుకు మోక్షం కలిగింది. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిజర్వాయర్ పనులు శంకుస్థాపన చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, యాదాద్రి మెడికల్ కళాశాల, వేద పాఠశాల, ఆర్‌అండ్ బీ రోడ్లు, గోదాములు, మోటకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలతో పాటు ఇతర అభివృద్ధి పనులను శంకుస్థాపన చేయనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలపూర్ నేడు సీఎం సభ అధికారులు ఏర్పాటులను మమ్మురంగా చేశారు. వేలాది కోట్ల విలువైన పనులకు సీఎం రేవంత్ రెడ్డి తిర్మలపూర్ లోనే శిలాఫలకాలు వేయనున్నారు. అక్కడే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి, పనులను తీరును పరిశీలిస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్నారు. తిర్మలపూర్ శివారులో 12 ఎకరాలు విస్తీర్ణంలో వేదిక వేసి పనులు పూర్తయ్యాయి. వర్షాకాలం మొదలవడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మూడు రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు. వేదిక మధ్యలో సభికులు వీక్షించేలా ఎల్‌ఈడి తెరలను ఏర్పాటు చేశారు. సభా వేదికకు సుమారు 350 మీటర్ల దూరంలో హెలీప్యాడ్ కు వృత్తి కారంలో 50 ఫీట్లతో సిసి వేశారు. దీని వెలుపల నుంచి 8 సీట్లు వృత్తి న్ని ఏర్పాటు చేశారు. సభ ప్రాంగణంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాసాలమర్రి వైపు రెండు చోట్ల 20 ఎకరాల పార్కింగ్ కు ఏర్పాటు చేశారు. రాచకొండ ట్రాఫిక్ డిసిపి మల్లారెడ్డి , భువనగిరి ఏసీపీ భాస్కర్ రెడ్డి ఆ స్థలాలలో పరిశీలించారు. నేడు సాయంత్రం నాలుగు గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రాగణంలో విద్యుత్ ఫ్లైట్లను నాలుగు వైపులా ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు చర్యలు ప్రారంభించారు.





**భారీ భద్రత:**

తిరుమలాపూర్ గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీగా భద్రత ఏర్పాట్లను చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు గ్రామంలో బహిరంగ సభస్థలిని పరిశీలించారు. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ గ్యాలరీ, స్టేజి, పైలాన్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. గంధమల్ల చెరువు వద్దకు వెళ్లి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయిదుగురు డీసీపిలు, 12 మంది అదనపు డీసీపీలు, 20 మంది ఏసీపీలు, సిఐలు 50 మంది, ఎస్సైలు 150 మంది, ట్రాఫిక్, సివిల్, సిఆర్పిఎఫ్ తో పాటు మొత్తం 1500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించమని తెలిపారు. సీఎం పర్యటనకు పోలీస్ శాఖ తరపున పగడ్బందీ భద్రత చర్యలను చేపట్టనున్నట్లు వెల్లడించారూ. పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సభకు ప్రజలు వచ్చే బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

సభకు హాజరుకానున్న మంత్రులు:

అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా శాఖల మంత్రులు రేవంత్ రెడ్డి వెంట రానున్నారు. మంత్రులు పొంగులేటి ప్రతి శ్రీనివాసరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, హాజరుకానున్నారు.



# చెట్లను పెంచి వాతావరణాన్ని పరిరక్షించాలి

## సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట టౌన్, జూన్ 05, మన సాక్షి :**



జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, చైర్మన్ ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ గురువారం జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ భవిష్యత్తులో మనము చెట్లను పెంచితేనే వాతావరణం పరిపుష్టంగా ఉండి మన జీవన ఆయు ప్రమాణాలు పెరుగుతాయని కాబట్టి ఈ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ ఒక్కొక్క చెట్టును దత్తత తీసుకొని పెంచి పోషించాలని వాతావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం%-% అని పెద్దలు అంటుంటారని ఎందుకంటే మెరుగైన జీవితం కోసం ఆరోగ్యంగా ఉండడం తప్పనిసరి అని అన్నారు.
కాలుష్యాన్ని తగ్గించాలంటే సోలార్ పవర్ ఉత్పత్తి పెంచుకోవాలన్నారు. ఇళ్లలో లెడ్ లైట్ల వాడకం పెరగాలనీ ప్లాస్టిక్ రీసైక్లింగ్ పక్కాగా అమలవ్వాలన్నారు. అడవుల్ని పెంచాలనీ చెట్లను నరికేవాళ్లపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. భారీ చెట్లను తొలగించాల్సి వస్తే.. వాటిని మరో చోట నాటాలనీ, వ్యవసాయంలో సంప్రదాయ సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్ని అమలుచెయ్యాలనీ సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచాలనీ, భూమి మన ఇల్లు దీన్ని పరిశుభ్రంగా, పచ్చగా ఉంచుదా మన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ప్రకృతిని కాపాడుకుందాం అని పేర్కొన్నారు. తదుపరి సఖి సెంటర్ ఆవరణలో న్యాయమూర్తి మరియు ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నందు నామాజీ, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్స్ కె. లక్ష్మీపతి గౌడ్, నాగేశ్వరి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతయ్య, ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్, షి టీం మరియు భరోసా సెంటర్ వాళ్ళు మరియు పారా లీగల్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**శేరిలింగంపల్లి,జూన్ 05,మన సాక్షి:**

మాదాపూర్,హాఫీజ్పేట్ డివిజన్ల పరిధిలోని మాతృ శ్రీ నగర్, జనప్రియ నగర్ ఫేస్ 2, రామ కృష్ణ నగర్,ప్రజాయ్ సిటీ కాలనీలలో రూ. 1 ఒక కోటి 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిధిగా పాల్గొం కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్ , పూజిత జగదీశ్వర్ గౌడ్ , జలమండలి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని,అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని అన్నారు. కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వివరాలు మాతృ శ్రీ నగర్ కాలనీ లో రూ..40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి నిర్మాణం పనులకు 2. జనప్రియ నగర్ ఫేస్ 2 కాలనీ లో రూ.85 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి నిర్మాణం పనులకు. 3.రామకృష్ణ నగర్ , ప్రజాయ్ సిటీ కాలనీలలో రూ.35. లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారుల డిజిఎం అమీరుద్దీన్ నాయకులు కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా చిట్టెం అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నారాయణపేట టౌన్, జూన్ 05 మన సాక్షి :**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని అనాధాశ్రమంలో ఆర్టీవో బోర్డ్ సభ్యుడు పోషల్ రాజేష్ ఆధ్వర్యంలో గురువారం పిసిసి సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టెం విజయ్ రెడ్డి జన్మదిన సందర్భంగా అనాధ ఆశ్రమంలోచిన్నారుల కు నోట్ పుస్తకాలు పండ్లు పంపిణి చేశారు. అదేవిదంగా వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సలీం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు, మాజీ కౌన్స లర్ ఆలేనూర్ వినోద్, పేరపళ్ళ శంకర్, అన్వార్ సునీల్, జనార్ధన్, సుతారి సత్తిరెడ్డి బుర్ర బసప్ప యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలి



**శేరిలింగంపల్లి,జూన్ 05,మన సాక్షి:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని డీసీ ప్రశాంతి ,కార్పొరేటర్ ,హమీద్ పటేల్ , కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కనీసం ఒక్క మొక్క నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంలో భాగస్వాములవ్వాలి. భవిష్యత్ తరాల కోసం శుభ్రమైన, స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరం అని అన్నారు.ఈ భూమి మీద నివసించే ప్రతి జీవికి మొక్కలే జీవనాధారం అని,మొక్కే శ్రీ రామ రక్షా అని,పర్యవరణాన్ని కాపాడుతే అది మనల్ని కాపాడుతుందని , పర్యావరణ సమతుల్యత లోపిస్తే ఈ భూమి మీద జీవి మనుగడకే ప్రశ్నార్ధకమని ,కావున మొక్కల పెంపకం అనేది చాల మంచి కార్యక్రమం అని,మొక్కలతో పుట్టుకతోనే మనం అనుబంధాన్ని కలిగి ఉన్నామని. మొక్కలను నాటి వాటిని వదిలివేయకుండా వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకొని తల్లి పిల్లను పెంచి పోషించినట్టు మొక్కను వట వృక్షంలాగా పెంచి పోషించాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి ఎస్ ఆర్ పి భరత్, విద్యాసాగర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిది

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, జూన్ 05, మన సాక్షి:**



ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి(ఆర్.ఓ.ఆర్.) రికార్డ్స్ ఆఫ్ రైట్స్ యాక్ట్ ప్రవేశపెట్టడం జరిగిందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. గురువారం కొల్చారం మండలం రంగంపేట గ్రామం భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. భూభారతి విశిష్టతను తెలియజేశారు. హెల్ప్ డెస్కుని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తులను నింపడంలో పొరపాట్లు చేయరాదని చెప్పారు. అధికారులు కూడా సంబంధిత లబ్ధిదారులతో ముందుగా మాట్లాడాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని, తద్వారా పరిష్కరించడం సులభతర మవుతుందన్నారు. రికార్డులలో ఉన్న తప్పులను సరి చేయడం జరుగుతుందని లబ్ధిదారులు కూడా సహనం పాటించాలన్నారు. భూభారతిలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు కావలసిన పత్రాలను కూడా సమర్పించాలన్నారు.ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారులు సిబ్బంది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రజా పాలన కాదు..ఎగవేతల పాలన..!

**నారాయణపేట టౌన్, జూన్ 05, మన సాక్షి :-**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి ప్రజాపాలన అంటూ ఎగవేతల పాలన సాగిస్తున్నారని నారాయణపేట జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో విమర్శించారు.ఎన్నికల్లో అనేక హామీలిచ్చి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు.రైతులకు2 లక్షల వరకు రుణమాఫి చేస్తామని ఆశ చూపి ఎన్నో కొర్రీలు పెట్టి నేటి వరకు ఇచ్చిన హామీ మేరకు 2లక్షల రుణమాఫి చేయలేదని అన్నారు. అలాగే పంట పెట్టుబడికి రైతు భరోసా కింద ఎకరాకు 15 వేలు ఇస్తామని చెప్పి ఒక ఏడాది రైతు భరోసా ఎగ్గొట్టి ఇప్పుడు ఎకరాకు 12 వేలు మాత్రమే ఇస్తామని చావు కబురు చల్లగా చెప్పి దానిని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ఎగవేసిందన్నారు. అలాగే 4 వేలు పింఛన్ ఇస్తామని, మహిళలకు2,500/- ఆర్థిక సహాయం చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని,కళ్యాణ లక్ష్మి కింద తోలం బంగారం ఇస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అన్నింటినీ ఎగవేసిందని విమర్శించారు.ఈ ఎగవేత కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపనిచ్చారు.

# రైతులు వ్యవసాయంలో రసాయనాల వినియోగం తగ్గించుకోవాలి



**నారాయణపేట టౌన్,జూన్ 05,మన సాక్షి :**

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా నారాయణ పేట మండలంలోని ఏక్లాస్ పూర్ గ్రామంలో గురువారం వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త జెడి. సరిత రైతు లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త డా. జె డి. సరిత మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో రసాయనాల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. వాటి స్థానంలో పచ్చిరొట్ట మరియు వానపముల ఎరువు, జీవన ఎరువులు వాడాలని సూచించారు. పప్పు జాతి పంటల తో పంట మార్పిడి చేయడం ద్వారా అధిక ఆదాయం తో పాటు భూసారం పెంచుకోవచ్చు అని తెలిపారు. రైతులు రషీదు లను భద్రపరచుకోవడం ద్వారా కష్ట కాలం లో నష్ట పరిహారం పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ పేట ఎం ఏ ఓ. బాల దినకర్, ఏవో, బి. రాజేష్, రైతులు హాజరయ్యారు.

# ప్రభుత్వం ద్వారా గోషాలలు ఏర్పాటు చేయాలి



**నారాయణపేట టౌన్, జూన్ 05, మన సాక్షి :**

ప్రభుత్వం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గోశాలలను ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో గోరక్ష అంశంపై ధర్నా నిర్వహించి మాట్లాడారు. గోవులపై దాడులను అరికట్టాలని గో రక్షకులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణా ఆపాలని విదేశాలకు ఎగుమతి అవుతున్న గోమాంసన్ని అరికట్టాలని ధర్నా నిర్వహించారు. అవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ కార్యదర్శి, ప్రవీణ్ జిల్లా బజరంగ్దళ్ సంయోజక్ వడ్ల శ్రావణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మురళి, అమ్మపల్లి చిన్నారెడ్డి, ఎలక్ట్రిషన్ సందీప్, మహేష్ చిల్లాల్ , చంద్రశేఖర్, హిందూ బంధువులు బజరంగ్దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**దోమకొండ,జూన్ 05, మన సాక్షి:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ సుధాకర్ అన్నారు. దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామంలో, రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను గురువారం స్వీకరించారు.ఈ సందర్భంగా తాహసిల్దార్ సుధాకర్ మాట్లాడుతూ..... భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకొని దరఖాస్తులను అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ రేఖ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**కంగ్టి, జూన్ 05, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల తడ్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ దర్జీ రమేష్ కుటుంబీకులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి గురువారం పరామర్శించారు. దర్జీ రమేష్ తండ్రి దర్జీ పండరి బుధవారం మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి తీవ్ర సంతాపం తెలిపారు.టిఆర్ఎస్ కార్యకర్త దర్జీ రమేష్ అన్ని విధాలుగా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రవీందర్ నాయక్, శంకర్ నాయక్, ముక్కని గ్రామ ప్రజలకు తదితరులు ఉన్నారు.

# భూ భారతి పై అవగాహన కలిగి ఉండాలి

**దేవరకొండ, జూన్ 05, మన సాక్షి:**



భూ భారతి చట్టంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని దేవరకొండ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం డివిజన్లోని తహసిల్దార్లతో రాజస్వ మండల అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు.రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని సూచించారు.భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని, అర్జీలు స్వీకరించాలని తెలిపారు.

# కార్మిక ,కర్షక సమ్మెను విజయవంతం చేద్దాం

**నారాయణపేట టౌన్, జూన్ 05, మన సాక్షి :-**




శతాబ్ద కాలం నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి, కొన్నింటిని రద్దుచేసి యజమానులు అనుకూలంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డిఎ ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతు జూలై 9 జరిగే సమ్మెలో కార్మిక వర్గం పాల్గోనాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పిలుపునిచ్చారు. గురు వారం జిల్లా కేంద్రంలో సిఐటియు. కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా మే 20 న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని అయితే దేశంలో పహాల్గాంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడి అమాయకపు ప్రజల ప్రాణాలు బలిగొనడంతో ఆ తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో జూలై 9 కి సమ్మె వాయిదా వేసుకోవటం జరిగిందన్నారు. జూలై 9 న జరిగే దేశవ్యాప్త కార్మిక కర్షక జాతీయ సమ్మెలో నారాయణపేట జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని కోరారు.ప్రభుత్వాల విధానాల వల్ల కార్మికులకు రైతులకు ప్రజలకు నష్టం కలిగిస్తే ఉద్యమించడమే మార్గం తప్ప మరొకటి లేదని తెలిపారు.లక్షల కోట్ల రూపాయలు బడా పెట్టుబడిదారులకు పారిశ్రకవేత్తలకు రుణమాఫీలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు 24 గంటల పాటు వైద్య సదుపాయాలు ప్రజలకు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.కార్మిక కర్షక సమ్మెతో నైనా ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను వెంటనే రద్దు చేయాలని కార్మిక హక్కులను కాపాడాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు గోవిందరాజ్,క్షేత్ర సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు బి కాశీనాథ్, ఆశా యూనియన్ జిల్లా అద్యక్షులు బాలమణి మిస్కిన్, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు కె సాయిలు, మెప్మా ఆర్పిల యూనియన్ జిల్లా అద్యక్షురాలు సౌభాగ్య,ప్రభుత్వ వసతి గృహాల కార్మిక సంఘం జిల్లా నాయకులు కృష్ణ మడివాలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నివారణపై అవగాహన



**సూర్యాపేట రూరల్, జూన్ 05,మన సాక్షి:**

సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలో వివిధ రకములైన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రకటించారు.ఈ బహుమతులు జూన్ 25న హైదరాబాద్లో జరిగే కార్యక్రమంలో మెడల్,సర్టిఫికెట్ అందజేస్తరూ.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నీల మాట్లాడుతూ డ్రగ్స్ విషం కన్నా ప్రమాదమైనదని యువత డ్రగ్స్ కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా డ్రగ్స్ నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు.ఇట్టి కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పెద్దింటి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ స్వరూప, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ నటేష్, మహేష్, ప్రీతం కుమార్, సుజాత,భవాని, డా.తులసి, ఫర్హీన్ పరిపాలనాధికారి దేవులపల్లి వినయ్ కుమార్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట టౌన్, జూన్ 05, మన సాక్షి :-**

నారాయణపేట్ జిల్లాకు చెందిన గిరిజన బాల, బాలికల నుండి 2025-26 విద్య సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ పాఠాశాలలలో 3, 5, 8వ తరగతులలో మొత్తము సీట్లు (08) కలవు పై తరగతుల ప్రవేశములకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.తల్లిదండ్రుల సంవత్సరాదయము గ్రామీణ ప్రాంతాలలో 1,50,000/-, పట్టణ ప్రాంతాలలో 2,00,000/-.లకు మించరాదన్నారు.దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, మహబూబ్ నగర్ వారి కార్యాలయములో ఈనెల 9 నుండి 13 వరకు ఉచితముగా లభించును. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, మహబూబ్ నగర్ వారి కార్యాలయము నందు ఈనెల17న సాయంత్రము 5:00 గంటలలోగా దరఖాస్తులు సమర్పించి, రశీదు తీసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు క్రింద చూపబడిన ధృవీకరణ పత్రములు గజిటెడ్ అధికారిచే అటేస్ట్ డ్ చేయబడి ఉండవలెను. కుల ధృవీకరణ పత్రము (మీ సేవ ద్వార జారి చేయబడినది),పుట్టిన తేది, స్వస్థలం ధృవీకరణ పత్రము,ఆదాయ ధృవీకరణ పత్రము ఈ సంవత్సరమునకు సంబంధించినదై ఉండాలన్నారు. మీ సేవ ద్వార జారి చేయబడినది) పాఠశాల బోనఫైడ్,ఆధార్ కార్డు, 2 పాస్ పోర్ట్స్ సైజు ఫొటోస్ ఉండాలన్నారు. పై సూచించిన ఏ సర్టిఫికెట్ లేకున్నా, ధరఖాస్తు ఫారములు తిరస్కరించబడతాయని తెలిపారు. లాటరీ పద్ధతిలో ఈనెల 21న నారాయణపేట జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం లో ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షములో లాటరీ పద్ధతిలో సీట్లో కేటాయించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 08542-251855 కు సంప్రదించాలన్నారు.

## మానవ మనుగడ పర్యావరణం తోటే



**రామసముద్రం,మే 05, మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా భావితరాల కోసం కన్నబిడ్డల్లా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచుకోవాలని రాజంపేట టీడీపీ నియోజకవర్గ పార్లమెంట్ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. గురువారం మన్నూరు హై స్కూల్ నందు మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడ సాగించాలంటే పర్యావరణం ఎంతో అవసరం అని, పర్యావరణం కాపాడుకోవాలంటే మొక్కల పెంపకం ఇంకా ఎంతో అవసరం, ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను ఎలా చూసుకుంటారో అలా మొక్కలను కాపాడుకుంటే భవిష్యత్తు బంగారం మాయమై ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం కాపాడి,ప్రతి ఒక్కరికి ఆయుష్షును అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బంది పలువురు టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పై కమ్యూనిస్టుల పోరాటం

**అర్వపల్లి,జూన్ 05,మన సాక్షి:**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాట చేసేది కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే, నాగారం సిపిఎం మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు కార్యకర్తలకు పూర్తి అవగాహన ఉండేందుకుగాను ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. వచ్చే వానకాలం సీజన్లోనైనా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అదే విధంగా నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు మల్లయ్య, ఖండె బిక్షం, మహేందర్, ప్రమీల పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి



**నడిగూడెం,జూన్ 05,మన సాక్షి:**

రెవిన్యూ గ్రామాలలో భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులలో భూ సమస్యలపై స్వీకరిస్తున్న దరఖాస్తులను నిరంతర ప్రక్రియగా కొనసాగించి దరఖాస్తులను స్వీకరించాలని సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కోరారు. గురువారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో కొందరు రైతులు సమయానికి దరఖాస్తులు ఇవ్వలేకపోయారని అలాంటి వారి కోసం రెవెన్యూ సదస్సులు పూర్తి చేసుకున్న గ్రామాలలోని రైతులు భూ సమస్యలపై ఇచ్చే దరఖాస్తులను స్వీకరించేందుకు మరో అవకాశం ఇవ్వాలని సిపిఎం మండల పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ సరిత కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏనుగుల వీరాంజనేయులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బక్రీద్ కోసం ఏర్పాట్లు పూర్తి

**దేవరకొండ,జూన్ 05,మనసాక్షి :**



నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఈ నెల 7న శనివారం రోజు జరగబోయే బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవరకొండ ఈద్గాహ్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ పేర్కొన్నారు. నగరంలో ప్రధానంగా ఈద్గాహ్ వద్ద జరగబోయే ఈద్ - ఉల్ - జుహ ప్రత్యేక నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 9 గంటలకు నమాజ్ ఉంటుందన్నారు. త్రాగునీరు, వజూ నీరు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని, వృద్ధులు వికలాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈద్గాహ్ వద్ద పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో తమతమ వాహనాలను పార్క్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని తెలిపారు, నమాజ్ కు వచ్చే వారు తమ వెంట జానిమాజ్ తీసుకోరావాలని ఈ సందర్భంగా కమిటీ కోరింది. అదేవిధంగా ఈద్గాహ్ వద్ద నమాజ్ అందనివారికి 9 : 30 గంటలకు నగరంలోని జామియా మస్జిద్ లో ఏర్పాట్లు చేశామన్నారు.. ఒకవేళ పండుగ రోజు వర్షం కురిస్తే నగరంలోని ప్రధాన మస్జీదులైన మక్కా మస్జీద్, జామియా మస్జీద్, అఖ్సా మస్జీద్, ఖుతుబ్ షాహీ మస్జీద్ లలో 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇలియాస్ పటేల్, యమ్ ఏ అబ్దుల్ ఖదీర్, సయ్యద్ దస్తగిర్, మహ్మద్ షబ్బీర్, ఎస్ కె బురానొద్దీన్, మహ్మద్ ముజీబ్, ఖాజా మైనొద్దీన్, మహ్మద్ జాఫర్, మహ్మద్ షకీల్, సయ్యద్ అజీజ్, యండి సలీమ్, మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ షఫీఉల్లా, యండి ఖాజా, ఎస్ కె ఇల్యాస్ బాబా, హమీద్, ఎస్ కె మంజూర్, అజ్మత్, ఇస్మాయిల్, బారి, షేహభాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను పరిశీలించిన ఆర్డిఓ

**అర్వపల్లి,జూన్ 05,మన సాక్షి:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్ రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపురంలో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సును పరిశీలించి మాట్లాడారు. ప్రతిరోజు రెండు గ్రామాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. రైతులు వారి భూముల విషయంపై ఎలాంటి సమస్యలను సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గురువారం తిమ్మాపురం పర్సాయపల్లి గ్రామంలో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు, తిమ్మాపురంలో 178 మంది పర్సాయ పల్లి లో 26 దరఖాస్తులు మొత్తం 204 దరఖాస్తులు, ఈరోజు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ భాషాపాక శ్రీకాంత్, నాయబ్ తాసిల్దార్ చిప్పలపల్లి యాదగిరి, రెవెన్యూ అధికారులు పాటి వెంకటరెడ్డి, రామారాజు జలంధర్ రావు, ఖమ్మం పాటి సైదులు, సరిత మల్లేశ్వరి, శ్రీకాంత్ సోమేష్ ఇబ్రహీం శ్రీనివాస్ పాల్గొన్నారు

## రోడ్డును తవ్వారు..పూడ్చడం మార్చారు



**కంగ్టి, జూన్ 05, మన సాక్షి :-**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో మంగలి గల్లీలో మురుగు కాలువ నీరు కోసం బ్రిడ్జి పక్కన రోడ్డును తవ్వారని,తిరిగి దానిని పూడ్చకపోవడంతో రాకపోకలకు రాత్రిళ్లు వాహనదారులకు దానిని గమనించక ప్రమాదాలు బారిన పడుతున్నారని కాలనీవాసులు చెప్పారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు ప్రవహించడానికి పైపు వేసి తవ్విన రోడ్డును మూసివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో మండల అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రం

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉండునని వారి ఆరోగ్య పరిరక్షణ కొరకు మున్సిపాల్టీ వారు హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు.100 రోజుల ప్రణాళిక లో భాగంగా సూర్యాపేట మున్సిపాల్టీలో పారిశుద్ధ్య విభాగం సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు పరిశీలించి,కార్మికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఇట్టి క్యాంపులో పరిక్ష ల అనంతరం ఎవరికి అయిన జబ్బు ఉన్నదని తేలితె వారిని పై ఆసుపత్రి పంపించి మెరుగైన వైద్యం అందించాలి అని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు, వేంటనె ఏరియా హాస్పిటల్ సూపరెంట్ కు నేరుగా ఫోన్ చేసి మున్సిపల్ సిబ్బందికి మెరుగు ఆయిన వైద్యం అందివ్వాలని తేలిపారు.ట్రిట్ మెంట్ విధానాన్ని దగ్గర ఉండి కలేక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ మున్సిపల్ ప్రత్యేక అధికారి డాక్టర్ పర్స రాంబాబు, కమీషనర్ బి.శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్,డాక్టర్ మల్హార్ ,డాక్టర్ ప్రవళిక,గౌస్ ,ఎస్.ఎస్.ఆర్ .ప్రసాద్ ,యాదగిరి వైద్య,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణం కాపాడుకునే బాధ్యత అందరి పై ఉంది



**దామరచర్ల,జూన్ 05,మన సాక్షి:**

పర్యావరణం హితం కోసం వ్యవసాయం చేసే రైతులు పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు తగిన విధంగా జాగ్రత్తలు పాటించాలని పంట పండించే రైతు ఆహారం వినియోగించే వినియోగదారుడు అందరూ సంక్షేమంగా ఉండాలన్నదే కొట్టేవా అగ్రి సైన్స్ కంపెనీ వారి ముఖ్య ఉద్దేశం అని టిబిఎం అన్వర్ భాష ఎండిఓ రవివర్మ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ను పురస్కరించుకొని కొట్టేవా అగ్రి సైన్స్ కంపెనీవారు దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామ రైతులకు రైతు వేదిక నందు పురుగు మందుల వాడకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంపై ముఖ్యంగా వాడుతున్న మందులు రెడ్ లేబుల్ ఎల్లో లేబుల్ బ్లూ లేబుల్ గ్రీన్ లేబుల్ మందులు వ్యవసాయంపై పిచ్చి కారు చేసేటప్పుడు శరీరం పై భాగాన పడకుండా తగిన విధంగా రక్షకవచం మొహానికి మాస్క్ వాడాలని ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు సాయంత్రం 3 గంటల నుండి 5 గంటలకు మందులు పిచికారి చేయాలన్నారు. ప్రధానంగా గ్రీన్ లేబుల్ వాడినట్లయితే పర్యావరణం పై ప్రభావం పడదని అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పైన పేర్కొనబడిన విధంగా రైతులు పురుగు మందులు వాడుతున్నప్పుడు పలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకుని పంట దిగుబడిని పెంచుకొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రజలు రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పర్యావరణం బాగుంటేనే వాతావరణం బాగుంటుందని అందులో గాలి నీరు నేల కలుషితం కాకుండా అందరి ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ పరంగి రాంబాబు పాల్గొనగా ఆయనను కొట్టేవా కంపెనీ వారు శాలువతో సన్మానం చేశారు. అనంతరం రైతుల సమక్షంలో మొక్కను నాటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**కేసులు నమోదు అయిన మిల్లర్ల పై కఠిన చర్యలు**

**సన్న బియ్యం పంపిణీ జూన్ 30 వరకు కొనసాగుతుంది**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**

జిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సివిల్ సప్లై అధికారి, డి యం, డి ఆర్ డి ఏ పిడి, మెప్మా, డి సి ఓ,వ్యవసాయ అధికారులతో ధాన్యం కొనుగోలు పూర్తి అయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐ కే పి, మెప్మా, సహకార సంఘాలు, మార్కెటింగ్ లు లాంటి వివిధ శాఖలు సమన్వయము చేసుకుంటు జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినందుకు అధికారులను అభినందించారు.

ట్రక్ షీట్ ఆన్లైన్ లో నమోదు చేసిన 48 గంటలలోనే రైతులకి డబ్బులు జమ చేయటం జరుగుతుందని తెలిపారు.వచ్చే సీజన్ నాటికి ప్రతి సెంటర్ లో పాడి క్లినర్స్ ఉండేలా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని డి ఆర్ డి ఏ పిడి ని, డి సి ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సీజన్ లో ఏమైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగితే వాటిని వచ్చే సీజన్ నాటికి పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని అధికారులకి సూచించారు.

కేసులు నమోదు అయిన మిల్లర్లు పై కఠిన చర్యలు తీసుకోవాలని, అట్టి మిల్లులపై రోజు వారి నివేదికలు తమకి సమర్పించాలని అధికారులకి సూచించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం జూన్, జులై, ఆగస్టు(3) నెలలకి కలిపి ఒకేసారి సన్నబియ్యం చివరి కార్డు వరకు అందేలా జూన్ 30 వరకు పంపిణి కొనసాగుతుందని లబ్ధిదారులు ఒకేసారి రేషన్ షాప్ లకి ఎక్కువగా వస్తే ఎక్కువ సేపు నిల్చోవాల్సి వస్తుంది కాబట్టి రోజు కొంతమంది వచ్చేలా చూసుకోవాలని కలెక్టర్ అధికారులకి సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పిడి వివి అప్పారావు, సివిల్ సప్లై డి యం ప్రసాద్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి, డి సి ఓ పద్మ, మెప్మా పిడి రేణుక, అగ్రికల్చర్ అధికారి ప్రణవి,సివిల్ సప్లై డి టి లు, ఆర్ ఐ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకై గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ




**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి కొత్త బస్టాండ్ వరకు వాక్ ఫర్ బెటర్ ఎన్విరాన్మెంట్ అంశంపై సింగిల్ యూస్ ప్లాస్టిక్ తిరస్కరించడంపై ర్యాలీ నిర్వహించారు . ఈ ర్యాలీని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సలహాదారుడు జె. శశిధర్ మరియు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ లు ప్రారంభించారు.ప్రతి ఒక్కరం పర్యావరణ పరిరక్షణకు బాధ్యులం అని అన్నారు. అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవిస్తూ గాలి,నీరు ఆహారాన్ని కలుషితం కాకుండా కాపుడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు పర్యావరణ పరిరక్షణ నినాదాలు చెబుతూ ప్లకార్డ్స్ తో ర్యాలీని నిర్వహించారు. దశరథ ఫౌండేషన్ కొరిపల్లి కృష్ణ సహకారంతో ఉచితంగా చేతి సంచులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, బొలిశెట్టి మధు, గుండూరి కృపాకర్, మిర్యాల వెంకటేశ్వర్లు,వనమాల వెంకటేశ్వర్లు, మీలా మహాదేవ్, తల్లాడ రామచంద్రయ్య, సోమా సురేష్, ఆనంతుల సువర్ణ లక్ష్మి, ముప్పారపు విజయలక్ష్మీ డా. శిరీష,డా.అలేఖ్య, యామా రజని, బండి రాధాకృష్ణ రెడ్డి, నల్లపాటి మమత,మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేరు శెనగకాయలు పంపిణీ



**రామసముద్రం,జూన్ 05, మన సాక్షి:**

ఈ ఏడాది ఖరీఫ్ కు నాన్యమైన వేరు శనగకాయలను రైతులకు గురువారం రాగానిపల్లి పంచాయతీలో వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేశారు.జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు( బాబు) మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ఈఏడాది నాన్యమైన వేరుశనగ కాయలు రైతులకు పంపడం జరిగిందని రైతులు పాసు బుక్ కలిగిన ప్రతి రైతుకు వేరు శనగ కాయలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నజిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు (బాబు ),మణి ,సెమిపతి, శ్రీనివాసులు రెడ్డి, జగన్నాథరెడ్డి టిడిపి కార్యకర్తలు, రైతులు గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి




**నల్గొండ ,జూన్ 05 ,మన సాక్షి:**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాలుష్య నియంత్రణ మండలి ఎస్.ఈ వెంకన్న పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విధిగా అందరూ మొక్కలు నాటాలన్నారు. రోజు రోజుకు కాలుష్యం పెరుగుతున్న క్రమంలో చెట్లు నాటడమే ఇందుకు పరిష్కారమన్నారు వివిధ రకాల కాలుష్యం వల్ల ప్రతినిత్యం సమాజం అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటుందని కాలుష్యం నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ పుల్లారావు,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వరి సాగులో అధిక దిగుబడి పై అవగాహన



**సూర్యాపేట రూరల్,జూన్ 05, మన సాక్షి:**

సూర్యాపేట మండల పరిధిలోని తాళ్ల ఖమ్మం పహాడ్ గ్రామంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి వారు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ సి ఏ ఆర్, భారతీయ వరి పరిశోధన సంస్థ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీదేవి ఖరీఫ్ లో ప్రధాన పంట అయిన వరి సాగులో అధిక దిగుబడికి యాజమాన్య పద్ధతులు అదేవిధంగా వరి సాగులో సాగు ఖర్చు తగ్గించుకోవడానికి సులువైన మార్గాలు, తక్కువ ఖర్చుతో కలుపు నియంత్రణ, సరైన సమయం, సరైన మోతాదు మొదలైన అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ. నరేష్ కెవికె శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం వారు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలను రైతులు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు మరియు జీవన ఎరువులు, జీవ కీటక, శిలీంధ్ర నాశలు గురించి రైతులకు చూపించి వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు.గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంది మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యత చిరుధాన్యాలతో తయారుచేసే ఉత్పత్తుల గురించి రైతులకు వివరించారు తదనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని వివరించి రైతులతో కలిసి మొక్కలు నాటినారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, గ్రామ కార్యదర్శి కె. రేవతి, తుమ్మల రాము, వై శ్రీను, కనకయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**కంగ్టి, జూన్ 05, మన సాక్షి :-**

గ్రామాల్లో నెలకొంటున్న పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నట్లు ఉప తహసిల్దార్ అబ్దుల్ ముగ్ని, ఆర్ఐ తాజోద్దీన్ అన్నారు. గురువారం కంగ్టి మండల పరిధిలోని నాగూర్ ( కే ) గ్రామంలో భూభారతి 2025 పై అవగాహన కల్పిస్తూ రైతుల ,ప్రజల, భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం గ్రామంలో 5 దరఖాస్తులు రాగా భూ సమస్యను బట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం 6న నాగూర్ (బి) గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

**మేళ్లచెరువు,జూన్ 05,మన సాక్షి:**



ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మై హెూం పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పరిశ్రమలో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ప్లాస్టిక్ నిరోధాన్ని ఇంటి నుండే మొదలు కావాలని అన్నారు.గుడ్డ సంచుల వినియోగాన్ని పెంచాలని, మొక్కలను ప్రతి ఒక్కరూ విధిగా నాటాలని కోరారు.స్కూళ్లలో దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు.భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని అన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్ సింగ్,అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీవాత్సవ,సిపిపి వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు,జిఎంలు నాగేశ్వర్ రావు,శ్రీరామ్,పర్యావరణ విభాగం సీనియర్ మేనేజర్ నాగరాజు,అశోక్,రవి,సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సంతోషిమాత బ్రహ్మోత్సవం

**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**



సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రతిష్టించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం దేవాలయంలో బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివ రామ కృష్ణ శర్మ శ్రీ సంతోషిమాత, శ్రీ సత్య సాంబశివుడు, శ్రీ లక్ష్మి గణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత ,మానస దేవి మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అలంకరణలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలతో సామూహికంగా కుంకుమార్చన పుష్పార్చన, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజలు నిర్వహించారు. అనంతరం రుద్ర, లలిత, గణపతి హెూమాన్ని నిర్వహించి మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ సంతోషిమాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్ ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు నరేంద్రుని విద్యాసాగర్ రావు, బేలిదే అశోక్, కమిటీ సభ్యులు దేవర్శెట్టి సోమయ్య, యమ వెంకటేశ్వర్లు, మహంకాళి ఉపేందర్, గోపారపు రాజు, బ్రాహ్మండ్లపల్లి నాగమణి, కర్నాటి సూర్యకళ ,కక్కిరేణి పద్మ, మహంకాళి కవిత, ముదిరెడ్డి ప్రభావతి,గోపారపు స్వరూప రాణి, బచ్చు నీరజ, ఓరుగంటి కనకరత్నం, జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**

ప్రపంచంలో కాలుష్యం రోజురోజుకు అధికం అయ్యి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నది అని అట్టి ముప్పు నివారణ భావితరాల శ్రేయస్సు కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుటకు గాను విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. జూన్ 5 పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలోని పుల్లారెడ్డి చెరువు ప్రక్కన అమృత్ పథకం ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమము ద్వారా మహిళ సంఘాల సభ్యులు మొక్కలు పెంచి వాటిని పరిరక్షణ చేయుట ద్వారా ఉపాధి లభిస్తున్నది అన్నారు.అనంతరం పట్టణంలోని పుల్లారెడ్డి చెరువు ప్రక్కన గల సీవరేజ్ ట్రిట్ మెంట్ ప్లాంట్ ను సందర్శించి నీటి శుద్ధి చేయు విధానాన్ని పరిశీలించి ఇంజనీర్ లకు తగు సూచనలు చేశారు.అనంతరం మానసానగర్ రోడ్ నెంబరు-4 లోని పూర్తిచేసిన రోడ్డును పరిశీలించారు.జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్ లు నాణ్యత తో చేయాలి అని అట్టి పనుల పై సంబంధిత అధికారులు ఫీల్డ్ పై ఉండి పనులు చేయిచాలి అని,ఫైల్ ప్రాసెసింగ్ నియమ నిబంధనల ప్రకారం ఉండాలి అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు. సూర్యాపేట పట్టణంలో డీఎం ఎఫ్ టి నిధులతో జరిగిన పనులను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్,మున్సిపల్ ప్రత్యేక అధికారి డాక్టర్ పర్స రాంబాబు,మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్, మున్సిపల్ ఇ.ఇ యం.కిరణ్ ,డి ఇ సత్యారావు , పబ్లిక్ హెల్త్ డిఇ రమాదేవి,సానిటరీ ఇన్స్పెక్టర్ సారగాండ్ల శ్రీనివాస్, ఎ.ఇనరేందర్, రాజారెడ్డి, తిరుమలయ్య,ఎస్.ఎస్ .ఆర్ .ప్రసాద్ టీఎంసీ శ్వేత మహిళసంఘల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**రామసముద్రం,జూన్ 05,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో ప్రపంచ పరిసర దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ భానుప్రసాద్, టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల గ్రామసచివాలయాలు డంపింగ్ యార్డ్ పరిసరాలలో మొక్కలు నాటారు .ఎంపిడిఓ భానుప్రసాద్, విజయ్ కు మార్ గౌడ్ మాట్లాడుతూ బావితరాలకు కాలుష్యం లేని పర్యావరణాన్ని అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మొక్కలు విరువిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.మాలేనత్తం గ్రామ పంచాయతీ లోని సచివాలయం, పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది టిడిపి నాయకులు రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాను ప్రసాద్ ,మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ , టిడిపి యువనాయకుడు రూపేష్ రెడ్డి,ఏపీఓ మాధవి , నారాయణ రెడ్డి పంచాయతీ సెక్రటరీ మునిస్వామినాయక్ మండల అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు సర్పంచులు,విద్యార్థులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి పాలన పై విస్తృత ప్రచారం

**నల్లగొండ, జూన్ 05, మన సాక్షి:**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన పై దేశవ్యాప్తంగా ప్రచారాలలో భాగంగా ఈనెల 7 నుండి 18 వరకు నల్గొండ జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన సాహసోపత నిర్ణయాలను ప్రజలకు వివరించునట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాచం వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యశాలలో మాట్లాడిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో ముఖ్యంగా వృద్ధిరేటు సాధించామని మనిషికి ఐదు కిలోల చొప్పున ఉచితపంపిణీ చేశామని ముఖ్యంగా 370 ఆర్టికల్ ను రద్దుచేసి సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి మోడీ పాలనకు ప్రజలు మద్దతు తెలిపారనీ అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్ శ్యాంసుందర్ చింత ముత్యాలరావు దోనూరు వీరారెడ్డి వేణు లక్ష్మీనారాయణ సోమ నరసింహ దాచేపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట,జూన్ 05,మన సాక్షి:**

భావితరాలకు మంచి పర్యావరణ అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో వారి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటె కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, జిల్లా అదనపు కలెక్టర్ రేవెన్యు పి.రాంబాబు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటడం సంరక్షించడం దినచర్యలలో భాగం కావాలని కలెక్టర్ తెలిపారు. అటవీ శాఖ కార్యాలయాన్ని చూస్తే చాలా ముచ్చటగా అహ్లాదంగా ఉందని, కలెక్టరేట్ చుట్టూ కూడా ఇలాంటి ఆహ్లాద వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ల అధికారి నాగయ్యకు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అనే నినాదాన్ని తీసుకున్నారని, అందరం కలసి ప్లాస్టిక్ పొల్యూషన్ లేకుండా చేయాలని, రూరల్ ,అర్బన్ ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేయాలన్నారు. రూరల్ ఏరియాలలో డి ఆర్ డి ఓ, పంచాయతీరాజ్ సిబ్బంది కలిసి రాబోవు వన మహోత్సవంలో ఒక ప్రణాళిక బద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో బిగ్ డ్రైవ్ చేపట్టి లక్షలలో మొక్కలు నాటే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మునిసిపాలిటీలలో ఉన్న పార్కులలో ఇంకా సుందరీకరణ చేయాలని, కెమికల్ మొక్కలు నాటాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆక్సిజన్ పార్కులను హైలెట్ చేయాలని, పాఠశాలలు తెరిచిన తర్వాత పిల్లలను వనభోజనాలకు తీసుకువెళ్లి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. మొక్కలు పెంచడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ,జిల్లాలోని పాఠశాలలలో, హాస్టల్స్ లలో, రెసిడెన్షియల్ స్కూళ్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ డిటిడిఓ శంకర్కు తెలిపారు. అన్ని చోట్ల రోడ్లకు ఇరుపక్కల మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ నరసింహ మాట్లాడుతూ పరిశ్రమల వలన గ్రీనరీ తగ్గిపోతుందని అందరూ తమ వంతు కృషిగా పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.రాబోయే వనమోత్సవ కార్యక్రమాల్లో అన్ని శాఖలు తమకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించి మొక్కలు నాటాలని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున అటు విశాఖ అధికారి సతీష్ జిల్లా అధికారులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ పి రాంబాబు మాట్లాడుతూ మొక్కలు లేకుంటే సమస్త జీవరాసి మునగడలేదని, అన్ని వనరులు చెట్లనుండే వస్తాయని తెలిపారు. మొక్కలను పరిరక్షించడం కొరకు ప్రభుత్వం చట్టాన్ని తెచ్చి మొక్కలు కాపాడే పరిస్థితి ఏర్పడిందని, చెట్లను నరకడం వలన భూతాపం పెరిగిపోయి మనుగడకు కష్టంగా ఉందని, రాబోవు భావితరాల కొరకు మనమందరం మొక్కలు నాటి కాపాడి భావితరాలకు బంగారు బాట వేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం డిఆర్డిఓ వివి అప్పారావు పర్యావరణ దినోత్సవ సందర్భంగా పర్యావరణహిత జీవనశైలి తెలిపే గోడ స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్ జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్ అధికారి శ్రీనివాస్ డి సి ఓ పద్మ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆర్డీవో వేణుమాధవ్, ఎఫ్ ఆర్ వో ఎస్ ఆనంద రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, మంజుల, వెంకటేశ్వర్లు, గోపి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు .

# అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి





**నల్లగొండ, జూన్ 05 , మన సాక్షి:**

అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూసే బాధ్యత తనదని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో కనీసం పది వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు కావాలని ,ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానని, నిరుపేదలు అందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత తనదని తెలిపారు. ఇల్లు రానివారు ఎట్టి పరిస్థితిలో బాధపడొద్దని, భయపడవద్దని, అధైర్య పడకూడదని తెలిపారు. మొదటి విడతన అర్హులైన నిరుపేదలకు 3500 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుండగా, తక్కినవారందరికీ రెండవ విడతలో ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇల్లు అనేది ఆత్మ గౌరవం అని, ఇంటితోనే మహిళకు అందం వస్తుందని, గత పది సంవత్సరాలలో ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇల్లు కట్టిన పాపాన లేదన్నారు.

అర్హులు ఏ ఒక్కరు ఇందిరమ్మ ఇళ్లు లేకుండా ఉండరాదని, అదే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ఇల్లు రాకూడదని, ఈ బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. కొంత మంది నిరుపేదలు ఇదివరకే బేస్మెంట్ నిర్మించుకున్నారని, అలాంటి వారికి సైతం ఇల్లు ఇచ్చే విధంగా ప్రభుత్వానికి లేఖ రాయాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వం ఇంటి కోసం మంజూరు చేస్తున్న 5 లక్షల రూపాయలు సరిపోవని ,ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నల్గొండ జిల్లాలోని అన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నందున డిస్కౌంట్ పై సిమెంట్ ఇచ్చే విధంగా లబ్ధిదారులకు మేలు జరిగేలా మాట్లాడతానని తెలిపారు. తాను నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. నిరుపేద కుటుంబాల అందరికీ సొంతింటి కళ నెరవేరే వరకూ తను పోరాడుతానని తెలిపారు.

శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషమని అన్నారు. నియోజకవర్గంలో సుమారు పది వేల మంది వరకు నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇల్లు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా ఫ్లోరైడ్ ప్రాంతమని ,సుమారు 1500 ఫీట్లు బోరూ వేసినా నీరు పడని పరిస్థితి ఉందని తెలిపారు. అర్హులకే అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూసే బాధ్యత అధికారులపై ఉందని, అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది అన్నారు.నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా డిండి, ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లంల సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మునుగోడు సస్యశ్యామలం అవుతుందన్నారు.క్షేత్ర స్థాయిలో మరోసారి పూర్తిగా పరిశీలించి అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇల్లు అనేది ఇల్లు మాత్రమే కాదని, ఆత్మ గౌరవం పెంచే కార్యక్రమం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని, ఇందుకుగాను 200 మంది లబ్ధిదారులకు ఒక గజిటెడ్ అధికారిని నియమించి జాబితాను పరిశీలించి జిల్లాస్థాయిలో వచ్చిన జాబితాను 5 శాతం ర్యాండం పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు.మునుగోడు నియోజకవర్గం లో గురువారం 2100 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇళ్ల పట్టాలు పొందినవారు 30 రోజుల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేయాలన్నారు. డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్ కుమార్ ఇందిరమ్మ ఇండ్ల నియమ నిబంధనలు, నిర్దేశాలు,బిల్లుల చెల్లింపు, తదితర అంశాలను వివరించారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,రెవిన్యూ. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మునుగోడు నియోజకవర్గం పరిధిలోని మండలాల లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు.

# యశోద ఆసుపత్రిలో అత్యాధునిక ప్రమాణాలతో చికిత్స



**నల్లగొండ, జూన్ 05, మన సాక్షి:**

దీర్ఘకాలికమైన మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ చావు దగ్గరికి వెళ్లిన రోగిని యశోద ఆసుపత్రి డాక్టర్లు అత్యాధునిక ప్రమాణాలతో కూడిన చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన సంఘటన జరిగింది. యశోద ఆసుపత్రి కు చెందిన డాక్టర్లు వీరమనేని చేతన్ డాక్టర్ బి వెంకటరెడ్డి లు. గురువారం మనోరమ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 56 సంవత్సరాల వయసున్న జనార్దన్ రెడ్డి అనే రోగి దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో మూత్రం రాక కడుపు ఉబి జ్వరం శ్వాస సమస్యలు కాళ్ల వాపుతో బాధపడుతూ నల్లగొండ లోకల్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన అక్కడ రోగికి వ్యాధి నయం కాకకోవడంతో యశోద ఆసుపత్రిలో చేరినట్లు డాక్టర్లు తెలిపారు. వెంటనే తాము సకాలంలో రోగి స్థితిని గుర్తించి సరైన నిర్ణయాలు తీసుకొని. అరుదైన చికిత్స చేసి అతన్ని కాపాడినట్లు తెలిపారు.అతనికి తీవ్రమైన ఇన్ఫెక్షన్ కి కారణమైన గ్లోమేరీలో నెఫ్రాటిస్ వ్యాధి బయటపడిందని .వెంటనే తాము దానికి అనుగుణంగా చికిత్సను మార్చడం వల్ల రోగి ప్రాణాలను కాపాడడం సాధ్యమైంది అన్నారు. యశోద ఆసుపత్రి వైద్య నిపుణుల సమర్థవంతమైన చికిత్సకు స్పందించి రోగి మెల్లమెల్లగా కోల్పోవడం ప్రారంభమైందన్నారు. ఇప్పుడు రోగి పూర్తి స్థాయిలో ఆరోగ్యాన్ని పొంది తన పని తాను చేసుకున్నట్లు వారు తెలిపారు. మలక్పేట యశోద ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందిస్తూ ఎంతోమంది రోగుల ప్రాణాలను కాపాడడం జరిగిందని, ఏదైనా తీవ్ర సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రిలో చేరితే సకాలంలో వ్యాధులు గుర్తించి సరైన చికిత్స అందిస్తామని వారు తెలిపారు. మలక్పేట యశోద ఆసుపత్రిలో నల్గొండ జిల్లాకు చెందిన వారే ఎక్కువ వస్తుంటారని నల్గొండ జిల్లా ప్రజలకు మలక్పేట యశోద హాస్పిటల్ పూర్తిగా అందుబాటులో ఉందన్నారు.మలక్పేట యశోద ఆసుపత్రి తో పాటు అన్ని యశోద ఆసుపత్రులలో అత్యంత క్లిష్టమైన జబ్బులు వ్యాధులకు కూడా ట్రీట్మెంట్ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి కోఆర్డినేటర్ ఏ వాసు కిరణ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి .పాల్గొన్నారు

# శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు షురూ

## నేడు శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ - జమదగ్ని మహామునిల కళ్యాణం

## హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**కనగల్ జూన్ 05, మన సాక్షి:**

భక్తుల కొంగుబంగారంగా విరాజుల్లుతున్న నల్లగొండ జిల్లా, కనగల్ మండలంలోని దర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు వివిధ పూజా కార్యక్రమాలతో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ డప్పుచప్పుళ్ళు, మంగళ వాయిద్యాలతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

తెల్లవారుజాము నుంచి సుప్రభాత సేవ, లలితా సహస్రనామార్చన, బాలభోగ నివేదన, ధ్వజారోహణ, దేవి మూల మంత్ర హోమములు, మండల పూజలు, నీరాజన మంత్రపుష్పములు, మహా నివేదన, గవ్యాంత పూజలు, నిత్య హోమములు, వాస్తు పూజ, విగ్నేశ్వర పూజ, రక్షాబంధనము, అఖండ దీపారాధన, బలిహరణ, చండీ హోమం, ఎదురుకోళ్ళు మహోత్సవం వైభవంగా వేద పండితులు నిర్వహించారు.

నేడు శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం:

అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ - జమదగ్ని మహామునిల లోక కళ్యాణం కన్నుల పండుగ నిర్వహించనున్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కల్యాణ మండపం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. మంచి నీరు తదితర మౌలిక వసతులను ఆలయ పాలకమండలి, ఆలయ సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లను చేస్తున్నారు. రాష్ట్ర రోడ్లు - భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కల్యాణానికి హాజరు కానున నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేశారు. అమ్మవారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. కళ్యాణానికి వచ్చే భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జల్లేపల్లి జయరామయ్య, ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు సిహెచ్. నగేష్ గౌడ్, జె. నవీన్ గౌడ్, కె. శంకర్ రెడ్డి, ఎం. రాజు, కే. రమేష్, ఆర్. వెంకన్న, ఎన్. బాబు, సైదులు, సిహెచ్. దుర్గమ్మ, ఎం. రమేష్, కే. ప్రభాకర్, ఆలయ ముఖ్య అర్చకులు ఎన్. మల్లాచారి, సిహెచ్. శ్రవణ్ కుమార్ చార్యులు, అర్చకులు జి. ఉమామహేశ్వర రావు, దామోదర్ రావు, శ్రీనివాస్ చారి, ఫణి కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ జె. చంద్రయ్య, జి. నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఎన్. ఆంజనేయులు, కె. ఉపేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది టి. రాజయ్య, జె. రాజు, సిహెచ్. శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలి



**మిర్యాలగూడ, జూన్ 05, మన సాక్షి:**

మిర్యాలగూడ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాట చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల మీద మూడు నల్ల చట్టాలను తీసుకుని వచ్చి రైతుల నడ్డి విరిసే ప్రయత్నం చేస్తున్నారని వారన్నారు.మూడు నల్ల.చట్టాలను పూర్తిస్థాయిలో తొలగించాలని వారు అన్నారు కేంద్ర ప్రభుత్వానికి రైతులు మీద ప్రేమ ఉంటే రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరువులు పురుగు మందులు సబ్సిడీల మీద వారికి అందించాలని వారు డిమాండ్ చేశారు.రైతుల దగ్గర ధాన్యం ఉన్నప్పుడు తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే వడ్లను రీసైక్లింగ్ చేసి అందులో కొంత భావిస్తాను పొడి ని.కూడా కలిపి కొత్త కొత్త కంపెనీల పేరుతో 10 కేజీల బస్తాన్ని వెయ్యి రూపాయల నుండి 1200 రూపాయల వరకు తిరిగి రైతులకు అమ్ముతున్నారు రైతుల పరిస్థితి ఎట్లా ఉందంటే అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా ఉన్నదప్ప రైతులకు ఉపయోగం మాత్రం ఏమీ లేదు కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యానికి ఉపసమతిగా క్వింటాలకు 60 రూపాయలు చొప్పున పెంచి చేతులు దులుపుకున్నది తప్ప దాని వలన రైతులు ఏ మాత్రం ఉపయోగం లేదని వారన్నారు.రైతులు ఒక ఎకరానికి 40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తే ఐదు నెలల తర్వాత తిరిగి చూసుకుంటే రోజువారి కూలి కూడా పడే పరిస్థితి లేదని వారన్నారు ధరలకు అనుగుణంగా ధాన్యం రేటు పెంచాలని వారన్నారు ఈ రాష్ట్ర ప్రభుత్వం ధరణి బదులు భూభారతి తీసుకొని రావటం జరిగినది.రైతులు కానుండి వ్యవసాయం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని వారన్నారు. కొన్నిచోట్ల. 60 సంవత్సరాల నుండి భూమి మీద కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు తాతల తండ్రులనాడు పొలాలు పంచుకునేటప్పుడు పట్టాలు కొంత తారుమారైనాయి కానీ కబ్జాలో ఉన్న వాని పేరు మీద పట్టా లేకుండా అవతల ఉన్నవా అని పేరుమీద పట్టా ఉండటం వలన కబ్జాలో ఉన్న రైతుని పట్టా ఉన్న రైతు కోర్టుకు వెళ్లి కబ్జాలో ఉన్న రైతులని ఇబ్బందులు గురి చేస్తున్నారని వారన్నారు ఈ భూభారతిలో అలాంటి సమస్యలన్నీటిని పరిష్కరించాలని వాళ్లు డిమాండ్ చేసినారు ఖరీఫ్ పంటకు రైతు బంధువు వెంటనే వేయాలని వాళ్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు ఎర్రబోతు పద్మ బంటు బుచ్చయ్య అంజన్న పెల్లి రామలింగం బంటు రాజేశ్వరి సైదా తదితరులు పాల్గొన్నారు

# 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డిఎ కృషి ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్5:** పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశిరచుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

# అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరు పై ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**మిర్యాలగూడ,జూన్ 05, మన సాక్షి:**



దామరచర్ల మండలంలో వీర్లపాలెం గ్రామంలో నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణ రెడ్డి, ఎండీ యూసుఫ్,కుందూరు వీరకోటి రెడ్డి,అంగోతు హాతీరాం నాయక్, కటికం సైదులు రెడ్డి,కుర్ర సేవా నాయక్, హనిమి రెడ్డి, సోము సైది రెడ్డి, బాల సత్యనారాయణ,కోట్యా నాయక్, వీరబాబు నాయక్,కందుల నాగిరెడ్డి,పర్షియా నాయక్,కుర్ర శ్రీను నాయక్, పలసాని రామ్ రెడ్డి,రమావత్ వినోద్, రఫీ భాయ్,కొండారపు నాగేశ్వర రావు,వెంకట రెడ్డి,భీమా నాయక్, దత్తు నాయక్, అనిల్ నాయక్, సచిన్ నాయక్, సురేష్ నాయక్, షేక్ ఫయాజ్, బండి వెంకటేశ్వర్లు, సీతారాములు,కేశబోయిన కొండలు, చిన్న నాయక్,రవీందర్ నాయక్, నాగరాజు యాదవ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా డబ్బులు ఎప్పుడిస్తారు..?



## ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు

**తెలంగాణ:** వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతుండగా.. రైతు భరోసా నిధులపై అనిశ్చితి నెలకొంది. గత యాసంగి సాయం అసంపూర్తిగా ఉండటంతో, ఖరీఫ్‌కు కలిపి ఇస్తారా? లేదా అనే సందేహాలు న్నాయి. ఎకరంలోపు పంట సాగు చేస్తున్న సర్వే నంబర్ల సమస్యల వల్ల కొందరికి సాయం అందలేదు. సకాలంలో నిధులు అందకపోతే సాగు పనులు ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే నేటి కేబినెట్ సమావేశంలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణలో వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. భూములను దుక్కి దున్ని సిద్ధం చేసుకుని, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే 'రైతు భరోసా' పథకంపై అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం కింద ఎకరాకు రూ. 12 వేలు రెండు విడతల్లో రూ.6 వేల చొప్పున అందిస్తున్నారు.

గత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా సాయం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ కాలేదు. జనవరి 26వ తేదీ నుంచి ఎకరా, రెండు ఎకరాల చొప్పున విడతల వారీగా ఐదు ఎకరాలలోపు రైతులకు మాత్రమే సాయం అందించారు. ఆ తరువాత నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో, గత యాసంగి సాయం అందని రైతులు, ఈసారి రెండు సీజన్ల (యాసంగి, ఖరీఫ్) సాయం కలిపి ఇస్తారా? లేక ప్రస్తుత ఖరీఫ్‌కు మాత్రమే ఇస్తారా? అనే సందిగ్ధంలో ఉన్నారు. కొందరు రైతులకైతే ఎకరంలో లోపు ఉన్న రైతు భరోసా అందలేదు. సర్వే నెంబర్లలో భూముల లెక్కల తేడా కారణంగా పలువురు రైతులు రైతు భరోసా అందుకోలేదు.

ప్రస్తుతం ఖరీఫ్‌లో పత్తి, కంది, సోయా, వరి, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటికి అవసరమైన ఎరువులను సకాలంలో తెప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున.. ఈసారైనా రైతు భరోసా సాయం పూర్తి స్థాయిలో, సకాలంలో అందుతుందా లేదా అని అన్నదాతలు మదనపడుతున్నారు. పెట్టుబడి సాయం సకాలంలో అందకపోతే, సాగు పనులు ప్రారంభించడంలో జాప్యం జరగవచ్చునని ఇది పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై త్వరగా స్పందించి, రైతులకు స్పష్టతనివ్వాలని, సకాలంలో సాయం అందించాలని కోరుతున్నారు.

కాగా, కేబినెట్ సమావేశం కానుంది. ఈ భేటీలో రైతు భరోసా పంట పెట్టుబడి సాయం నిధుల విడుదలపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది. ఇప్పటికే నైరుతి రాష్ట్రంలోకి ప్రవేశంచటం, రైతులు పంటల సాగుకు సిద్ధమైన నేపథ్యంలో సాయం విడుదలకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# రేషన్ కార్డు కావాలా.. అయితే రూ.5వేలు కొట్టు!

**తెలంగాణ:** కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఊపందుకుంది. అయితే, కొందరు దీన్ని అదునుగా తీసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డు కావాలంటే వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారట. ఈ దందా వెనుక మీ సేవా కేంద్రాల నిర్వాహకుల హస్తం ఉందని సమాచారం. పేదలు మాత్రం డబ్బుల్లేక రేషన్ కార్డుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో ఈ తరహా వసూళ్ల పర్వం కొనసాగుతోందని ఆరోపణలు వస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు లభించాలంటే రేషన్ కార్డు కచ్చితంగా ఉండాల్సిందే. తెలంగాణలో దాదాపు దశాబ్దం తర్వాత కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించారు. దీంతో చాలా మంది కొత్త రేషన్ కార్డులకు అప్లై చేసుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఫ్రీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు అర్హులు కావాలంటే రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. దీంతో చాలా మంది రేషన్ కార్డుకు అప్లై చేసుకుంటున్నారు.



అయితే దీన్ని అదునుగా తీసుకుని.. కొందరు కొత్త దందా మొదలు పెట్టారు. రేషన్ కార్డు కావాలా.. అయితే రూ.5 వేలు కొట్టు అంటూ పేద, మధ్యతరగతి వారిని డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ నయా దందా జోరుగా సాగుతుందని ఆరోపణలు వస్తున్నాయి.

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల దందా పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ముఖ్యంగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లు ఈ దందా మొదలుపెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ కార్డు త్వరగా రావాలంటే.. కనీసం రూ.3000 నుంచి 5,000 వరకు చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిస్తే 15 రోజుల్లో విచారణ పూర్తి చేయించి మీ చేతిలో రేషన్ కార్డు పెడతామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీన్ని గుడ్డిగా నమ్మిన జనాలు ఆ మొత్తం చెల్లిస్తున్నారంటూ వార్తలు వస్తున్నాయి.

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో గత రెండు నెలల కాలంలోనే.. మీ సేవా కేంద్రాల ద్వారా సుమారు 2.66 లక్షల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే ఇంత భారీ ఎత్తున రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయి విచారణ పూర్తయిన కార్డుల వివరాలు కేవలం 10 శాతం మాత్రమే ఉన్నాయంటున్నారు. అయితే డబ్బులు ఇచ్చిన వారి దరఖాస్తులనే త్వరగా విచారణ పూర్తి చేసి.. కార్డులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి.

ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించి.. ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చాలామంది పేదవారు డబ్బులు లేక.. అర్హత ఉండి కూడా రేషన్ కార్డు పొందలేకుండా ఉన్నారని అంటున్నారు.

# 7కే కిలో గోధుములు.. వారికి మాత్రమే..!

**హైదరాబాద్:** రేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం పంపిణీతో పాటు ఒక్కో కార్డుపై 5 కిలోల గోధుమలను రూ.7కే అందిస్తున్నారు. గతంలో రూ.15 వసూలు చేయగా.. ప్రస్తుతం రూ. 7కే కేజీ గోధుమలు ఇస్తున్నారు. అంతకు మించి అధిక ధరలు వసూలు చేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ జరుగుతోంది. ఇటీవల 2 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరింది.

హైదరాబాద్ నగరవ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా ప్రస్తుతం మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. ఈ సారి ముందస్తు రుతుపవనాల నేపథ్యంలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని జూన్ నెలలోనే ఒకేసారి తీసుకోవాలని అధికారులు రేషన్ కార్డుదారులకు సూచించారు. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకుంటున్నారు.

ఇక హైదరాబాద్ నగరంలో రేషన్‌పై గోధుమలు సైతం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో కార్డు మీద 5 కిలోల గోధుమలు అందిస్తున్నారు. కిలో గోధుమలు సబ్సిడీపై రూ.7కే అందిస్తున్నట్లు హైదరాబాద్ డీసీఎస్‌వో రమేష్ స్పష్టం చేశారు. అంతకు మించి ఏ డీలర్ అయినా వసూలు చేస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గతంలో కిలో గోధుమలకు రూ.15 చొప్పున వసూలు చేసేవారు. అయితే లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత రావటంతో ప్రస్తుతం రూ. 7కే ఇస్తున్నారు. ఈ నిర్ణయం వినియోగదారులకు ఎంతో ఊరటనిస్తోంది.



ఇక తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల 2 లక్షల కొత్త రేషన్ కార్డులను సర్కార్ మంజూరు చేసింది. దీంతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 91.83 లక్షలకు చేరుకుంది. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతో కలుపుకొని 3.10 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఆహార భద్రతను కల్పిస్తుంది. కొత్త కార్డుల జారీ ప్రక్రియ మీసేవా కేంద్రాల ద్వారా, ప్రజా పాలన ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కొనసాగుతోంది.

రేషన్ పంపిణీలో పారదర్శకతను పెంచడానికి, ఇ-పోస్ రసీదులను నెలకు విడిగా (మూడు నెలలకు మూడు రసీదులు) జారీ చేయాలని అలాగే లబ్ధిదారులు ప్రతి నెలకు విడిగా బయోమెట్రిక్ ధృవీకరణ ఇవ్వాలని అధికారులు సూచించారు. రేషన్ సరుకులను అక్రమంగా విక్రయించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పేదల పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ నిర్ణయాలు లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడానికి, దళారుల బెడద తగ్గించడానికి దోహదపడతాయని సివిల్ సప్లయ్ శాఖ అధికారులు భావిస్తున్నారు.

# చిలుకూరు బాలాజీ దర్శన వేళలపై గందరగోళం..

**హైదరాబాద్:** చిలుకూరు బాలాజీ ఆలయంలో దర్శన సమయ వేళలపై గందరగోళం నెలకొంది. ఆలయ బోర్డులో ఒక సమయం, సోషల్ మీడియాలో మరో సమయం ఉండటంతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనం ఉంటుందని బోర్డులో ఉండగా, సోషల్ మీడియాలో వేరే సమయం చూపిస్తుండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఆలయ అధికారులు స్పందించి సరైన సమాచారం అందించాలని భక్తులు కోరుతున్నారు.

హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి బాలాజీని దర్శనం చేసుకుంటారు. ఈ స్వామివారిని వీసా బాలాజీ అని కూడా అంటారు. విదేశాలకు వెళ్లాలని భావించే వారు.. చిలుకూరు బాలాజీ ఆలయంలో 11 ప్రదక్షిణలు చేసి.. మొక్కుకుంటే.. తప్పకుండా వీసా వస్తుందని నమ్ముతారు.

అంతేకాక ఏవైనా కోరికలు తీరాలంటే.. ముందుగా 11 ప్రదక్షిణలు చేసి.. మనసులోని కోరిక గురించి బాలాజీ ముందు కోరుకోవాలి. ఆపై అది నెరవేరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేయాలి. ఇక శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. నగరం నలువైపుల నుంచి భక్తులు



ఇక్కడకు వచ్చి దర్శనం చేసుకుంటారు. ఇదిలా ఉండగా తాజాగా చిలుకూరి బాలాజీ దర్శన సమమానికి సంబంధించి గందరగోళం నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

చిలుకూరు బాలాజీ దర్శన సమయానికి సంబంధించి తీవ్ర గందరగోళం నెలకొని ఉంది. గుడి వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో టైమింగ్స్ ఒకలా ఉంటే.. సోషల్ మీడియాలో మరో టైమింగ్స్ ఉన్నాయి. దీంతో భక్తులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో దర్శనం వేళల్లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు.. అలానే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అని పేర్కొన్నారు.

కానీ సోషల్ మీడియాలో మాత్రం బాలాజీ దర్శన సమయానికి సంబంధించి వేరే సమయం చూపిస్తుంది. దీని ప్రకారం.. చిలుకూరు బాలాజీ దర్శనం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అని.. అలానే తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. చాలా మంది భక్తులు సోషల్ మీడియాలో వస్తోన్న దర్శనం వేళలే కరెక్ట్ అనుకుని.. ఆ సమయానికి దర్శనానికి వచ్చి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

చాలా మంది భక్తులు సోషల్ మీడియాలో ఉన్న టైమింగ్స్ ప్రకారం గుడి దగ్గరకు వచ్చి.. ఆలయం మూసి ఉండటంతో.. గుడి బయటే కొబ్బరి కాయ కొట్టి నిరాశగా వెనుదిరుగుతున్నారు. దీంతో బాలాజీ దర్శనం వేళలకు సంబంధించి ఆలయ అర్చకులు, లేదా అధికారులు సరైన సమాచారాన్ని భక్తులకు తెలిసేలాగా ప్రచారం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆలయ అర్చకులు, లేదా పూజారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో దర్శనం వేళల్లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు.. అలానే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అని పేర్కొన్నారు.
కానీ సోషల్ మీడియాలో మాత్రం చిలుకూరు బాలాజీ దర్శనం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అని.. అలానే తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ముందే జాగ్రత్తపడ్డ పోలీసులు.. లేదంటే హైదరాబాద్‌లో కూడా

**హైదరాబాద్:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలుపుతో కర్ణాటకలో సంబరాలు మిన్నంటాయి. అయితే, బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన వేడుకలో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించారు, 50 మందికి పైగా గాయపడ్డారు.

ఐపీఎల్2025 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. ఇక ఆర్సీబీ విజయంతో కర్ణాటకలో సంబరాలు అంబరాన్నం టాయి. అభిమానుల ఉత్సాహం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక్క కర్ణాటకలోనే కాక.. మిగతా రాష్ట్రాల్లో కూడా ఆర్సీబీ గెలుపు పట్ల పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్సీబీ జట్టును సన్మానించేందుకు కర్ణాటక ప్రభుత్వం.. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో సభ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుక కాస్త విషాదంగా ముగిసింది.

ఆర్సీబీ జట్టు మెంబర్స్ చిన్నస్వామి స్టేడియా నికి వస్తున్నారని తెలియడంతో.. పెద్ద ఎత్తున అభిమానులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. అయితే అధికారులు ఊహించిన దాని కన్నా ఎక్కువ సంఖ్యలో అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టంగా మారింది. చివరకు లాఠీ ఛార్జ్ కూడా చేశారు. ఇంత భారీ ఎత్తున అభిమానులు తరలి రావడంతో తొక్కిసలాట చోటు



చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది చనిపోగా.. సుమారు 50 మంది వరకు గాయప డ్డారని అధికారులు తెలిపారు. బెంగుళూరులో జరిగినట్లుగానే హైదరాబాద్‌లో కూడా తొక్కిసలాట జరిగేందుకు అవకాశం ఉండేనని.. కానీ పోలీసుల ముందు జాగ్రత్త చర్యల వల్ల పెను ప్రమాదం తప్పిందంటున్నారు. బుధవారం ఆర్సీబీ జట్టు ఐపీఎల్ కప్పు గెలిచిన తర్వాత హైదరాబాద్‌లో కూడా సంబరాలు జరిగాయి. అభిమానులు ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం దగ్గర, సచివాలయం, తెలుగుతల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గాల్లో రోడ్ల మీదకు వచ్చి గెలుపు సంబరాలు నిర్వహించారు.

బైక్‌ల మీద ఫీట్లు చేస్తూ.. రోడ్ల మీద పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చారు. ఆ ప్రాంతాల్లో నిలిచి ఉన్న వాహనాల మీదకు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. అతి వేగంతో వాహనాలు నడిపి.. అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో ముందే అప్రమత్తమైన పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని.. వీరిని చెదరగొట్టారు. ఎక్కువ మంది గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు ఇలా వెంటనే స్పందిచడంతో హైదరాబాద్‌లో పెను ప్రమాదం తప్పిందంటున్నారు. లేదంటే బెంగుళూరులో జరిగినట్లే ఇక్కడ కూడా జరిగేది అంటున్నారు. ఇక బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రితో పాటుగా పలువురు క్రీడా, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కర్ణాటక ప్రభుత్వం 10 లక్షల రూపాయల పరిహారం ప్రకటించింది. ఈ ప్రమాదంలో చనిపోయిన ఓ వ్యక్తి తండ్రి ఆవేదన ప్రతి ఒక్కరిని కదిలి ంచింది. నా కొడుకును ముక్కలు చేయకుండా నాకు అప్పగించండి అంటూ అతడు అధికా రులను వేడుకున్నాడు. ఇక ఈ తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం ఓ కమిటీని వేసింది.



# తెలంగాణ కేబినెట్ భేటీ.. 2 పథకాల నిధుల విడుదలపై క్లారిటీ

**తెలంగాణ:** తెలంగాణ కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఉద్యోగుల సమస్యలు, రైతు భరోసా నిధుల విడుదల, బనకచర్ల ప్రాజెక్ట్, రాజీవ్ యువ వికాసం నిధులు, కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వంటి అంశాలపై చర్చించనున్నారు. ఉద్యోగులు పెండింగ్ డీఏల విడుదలపై ఆశలు పెట్టుకున్నారు, నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకం నిధుల విడుదలను ఆశిస్తున్నారు, రైతులు రైతు భరోసా తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

గురువారం తెలంగాణ కేబినెట్ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా ఉద్యోగులు సమస్యలు, రైతు భరోసా స్కీమ్ నిధుల విడుదల తేదీపై క్లారిటీ, బనకచర్ల ప్రాజెక్ట్ అంశం, రాజీవ్ యువ వికాసం నిధుల విడుదల, కాళేశ్వరం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వంటి పలు అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నేటి కేబినెట్ సమావేశంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి సమస్యలకు కేబినెట్ భేటీలో పరిష్కారం దొరుకుతుందని.. అలానే పెండింగ్ డీఏ విడుదల అంశంలో కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది అంటున్నారు. ఇప్పటికే బుధవారం నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో వారు అనేక అంశాలపై చర్చించారు. దీంతో నేటి కేబినెట్ భేటీ తర్వాత ఉద్యోగులకు సంబంధించి ఒకటి లేదా రెండు పెండింగ్ డీఏలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

అలానే రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి కూడా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు. ఇప్పటికే రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి శాంక్షన్ లెటర్ల పంపిణీ వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేబినెట్‌లో చర్చించి.. రూ. లక్ష వరకు నిధుల విడుదలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు.

అలానే నేటి కేబినెట్ భేటీలో రైతు భరోసా పథకం నిధుల విడుదల తేదీ, వర్షాకాలం పంటల సాగుపైనా నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది. అలానే ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, లబ్ధిదారలు ఎంపిక, ఇళ్ల నిర్మాణం మొదలు వంటి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే.. లబ్ధిదారులుగా ఎంపికైన వారికి అధికారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేటి కేబినెట్ భేటీలో ఈ పథకం అమలుపై చర్చ జరగనుంది. వీటితో పాటుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భూభారతి చట్టం అమలు, భూదాన్ భూముల వ్యవహారంతో పాటు పలు పెండింగ్ ప్రాజెక్ట్‌ల గురించి కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది. నేటి కేబినెట్ భేటీపై ఉద్యోగులతో పాటు, నిరుద్యోగులు, అన్నదాతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. మరి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి అంటున్నారు జనాలు.

# మాతృ ప్రేమకు సజీవ సాక్ష్యం..

**జగిత్యాల:** పట్టణంలో తల్లి ప్రేమకు అద్దం పట్టే హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ రైతు ఇంట్లో తల్లి ఆవు దూరమవడంతో.. లేగదూడ ఆకలితో అల్లాడిపోయింది. బిడ్డ ఆవేదన చూసి చలించిన రైతు.. దూడను ఆటోలో ఎక్కించుకుని తల్లిని వెతుకుతూ పట్టణం మొత్తం తిరిగాడు. కొత్త బస్టాండ్ వద్ద తల్లి ఆవు కనిపించగా.. బిడ్డను చూసి పట్టలేని ఆనందంతో ఆవు ఆటో వెంట ప్రాణాలకు తెగించి పరుగెత్తింది. ఈ అపురూప దృశ్యం మూగజీవాల్లోని నిస్వార్థ మాతృ ప్రేమకు నిదర్శనంగా నిలిచింది.

తల్లి ప్రేమను వర్ణించానికి మాటలు చాలవు. బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు పడే తపన.. కాసేపు కళ్లముందే కనబడకపోతే తల్లడిల్లిపోయే ఆ మాతృ హృదయం.. తల్లి నిస్వార్థ ప్రేమకు నిదర్శనాలు. అయితే.. వెలకట్టలేని ఈ తల్లి ప్రేమ.. కేవలం మనుషులోనే కాదు మూగజీవాల్లోనూ ఎంత బలంగా ఉంటుందో నిరూపించే.. అపురూప దృశ్యం జగిత్యాల పట్టణంలో ఆవిష్కృతమైంది. మూగజీవాల్లోనూ అదే ఆరాటం, అదే తపన, అదే నిస్వార్థం ఉంటుందని ఈ ఘటన నిరూపించటమే కాదు.. ఈ సంఘటన చూసిన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తల్లి ప్రేమకు సజీవ సాక్ష్యంగా నిలించింది.

జగిత్యాల పట్టణా శివారు గోవింద్ పల్లెకు చెందిన నరేందర్ అనే ఓ రైతు ఇంట్లో.. ఆవు ఇటీవలే ఓ లేగదూడకు జన్మనిచ్చింది. కొన్ని రోజుల క్రితమే పుట్టిన ఆ లేగదూడ.. తల్లి పాలు తప్ప ఇంకేమీ ఎరుగదు. అలాంటి చిన్ని ప్రాణం.. కంటి ముందు తల్లి కనపడకపోవటంతో అల్లాడిపోయింది. అయితే.. సాయంత్ర సమయంలో తల్లి ఆవు ఇంటి నుంచి వెళ్లిపోయి.. తిరిగి రాకపోవడంతో లేగ దూడ పడిన ఆవేదన వర్ణనాతీతం. ఆ దృశ్యాన్ని చూసి చలించిపోయిన నరేందర్.. తల్లిని బిడ్డను కలిపేందుకు తన ప్రయత్నాన్ని ప్రారంభించాడు. ఆ చిన్నారి దూడను తన ఆటోలో ఎక్కించుకున్నాడు. దూడను వెంటబెటు ్టకుని తల్లిని వెతుకుతూ.. గంటల తరబడి జగిత్యాల పట్టణం మొత్తం కలియతిరిగాడు.

పట్టణం నలుమూలలా వెతికిన తర్వాత.. కొత్త బస్టాండ్ దగ్గర నరేందర్‌కు తల్లి ఆవు కనిపించింది. తన బిడ్డను ఆటోలో చూసిన ఆ తల్లి ఆవుకు పట్టలేని ఆనందం. ఒకవైపు ఆనందం.. మరోవైపు తన బిడ్డ ఆకలితో అల్లాడిపోయిందన్న తపన.. ఆ ఆవు గుండెల్లో అలజడి రేపింది. ఆటోలో ఉన్న తన బిడ్డకు పాలిచ్చేందుకు మాతృహృదయం తల్లడిల్లిపోయింది. ఇంకేం ఆలోచించలేదు.. తన బిడ్డ ఎక్కడ దూరం అయిపోతుందో అన్న భయంతో, ఆకలితో ఉన్న తన బిడ్డకు పాలు ఇవ్వాలన్న తపనతో.. ఆ ఆవు ఆ ఆటో వెంటే పరుగులంకించుకుంది. వాహనాల రద్దీని కూడా లెక్కచేయకు ండా.. ప్రాణాలకు తెగించి బిడ్డ కోసం పరుగెత్తిన ఆ తల్లి ఆవు దృశ్యం.. అక్కడున్నవారి గుండెలను పిండేసింది.

# అడ్వాన్స్ కూడా తిరిగిచ్చేసిన పవన్!



ఇటీవల కాలంలో ఏ సినిమాకి రాని కష్టాలు 'హరిహర వీరమల్లు' చిత్రానికి చుట్టుముట్టాయి. ఐదేళ్లుగా సెట్స్ మీదున్న ఈ చిత్రం 2022లోనే విడుదల కావాల్సి ఉన్నా.. వాయిదాల మీద వాయిదాలు పడుతూ చివరికి జూన్ 12న రిలీజ్‌కి సిద్ధమైంది. పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా తెరకెక్కిన ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యతికృష్ణ దర్శకత్వం వహించగా ఏఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు. రెండు భాగాలుగా రానున్న మూవీలో తొలి భాగమైన 'హర వీర మల్లు : పార్ట్ 1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' జూన్ 12న రిలీజ్ కానుంది. హరిహర వీరమల్లు ప్రాజెక్ట్ మొదలయ్యే టైమ్‌కి బడ్జెట్ అంచనా రూ.150 కోట్లు అనుకోగా.. పూర్తయ్యేసరికి రూ.200 కోట్లు దాటిందని ఇండస్ట్రీ టాక్. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఏఎం రత్నం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినట్లు తెలుస్తోంది.

2022, ఏప్రిల్ 29, 2022 అక్టోబర్ 5, 2023, మార్చి 30.. తర్వాత అదే ఏడాది దసరాకి రిలీజ్ చేస్తామని ప్రకటించినా అదీ సాధ్యం కాలేదు. తర్వాత 2024లో సమ్మర్‌కి రిలీజ్ అని ఒకసారి, 2025 సంక్రాంతికి వస్తున్నాం అని మరోసారి చెప్పి వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత మార్చి 28 అని ప్రచారం చేసినా మళ్లీ వాయిదా పడి చివరికి మే 9న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. చివరికి ఆ డేట్ కూడా వాయిదా పడుతూ జూన్ 12న రిలీజ్‌కు సిద్ధమయ్యాడు వీరమల్లు. ఇన్ని ట్విస్టులతో 'హరిహర వీరమల్లు' సినిమా పరిస్థితి ఏంటో తెలియక పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ జుట్టు పీక్కుంటున్నారు. రిలీజ్‌కి ఇంకా వారం రోజులే టైమ్ ఉన్నా యూనిట్ ప్రమోషన్లు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. హీరో, హీరోయిన్లు లేకుండా నిర్మాత ఏఎం రత్నం మాత్రమే ఇంటర్వ్యూలు ఇస్తూ ఏదో మొక్కుబడిగా ప్రమోషన్లు చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మళ్లీ వాయిదా పడనుందని ప్రచారం జరుగుతోంది.

'హరిహర వీరమల్లు' దెబ్బకి ఏఎం రత్నం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్న వార్త ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. సినిమా పరిస్థితి చూసి పవన్ కళ్యాణ్ ఇప్పటికే అడ్వాన్స్ తప్ప మిగిలిన రెమ్యునరేషన్ వదులుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా నిర్మాత పరిస్థితి తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అడ్వాన్స్ కింద తీసుకున్న రూ.11 కోట్లు కూడా వెనక్కి ఇచ్చేశారట. అలాగే రిలీజ్ మళ్లీ వాయిదా పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారట.

'హరిహర వీరమల్లు' పరిస్థితి చూస్తుంటే జూన్ 12వ తేదీన రిలీజ్ కావడం కష్టమేనని ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రిలీజ్‌కి వారం రోజులే టైమ్ ఉన్నా ఇప్పటికీ ట్రైలర్ రిలీజ్ చేయకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఈ చిత్రం క్రియేట్ చేస్తోన్న కన్ఫ్యూజన్‌తో ఇతర చిత్రాల నిర్మాతలు ఇబ్బందులు పడుతున్నాయి, మే 9న రిలీజ్ చేస్తే గతంలో మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించినా.. చేతులెత్తేసి జూన్ 12కి వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ డేట్‌పైనా అనుమానాలు రావడంతో అసలు సినిమా రిలీజ్ అవుతుందా.. లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది.

# జీవితంలో ఇంకెప్పుడూ అలాంటి పని చేయను..



నా జీవితంలో ఎప్పుడూ ఎవరినీ అమర్యాదగా మాట్లాడలేదు. ఫుల్ వీడియో చూస్తే అందరికీ స్పష్టత వస్తుంది. కొన్ని ముక్కలు కట్ చేసి వైరల్ చేయడం బాధాకరం. నా కూతురు మరణం తర్వాత మానసికంగా బాధపడుతున్న సమయంలోనే ఆ వ్యాఖ్యలు వచ్చాయి. అసలెక్కువ బాధపడాల్సింది అలీ .. కానీ మిగతావాళ్లు ఆవేదన చెందడం బాధాకరం. అలీ ప్రేమగా స్పందిస్తే మిగతా వాళ్లు మధ్యలో అనవసరంగా ట్రోలింగ్ చేశారు అని వివరణ ఇచ్చారు రాజేంద్రప్రసాద్

హీరోగా, సహ నటుడిగా కొన్ని వందల చిత్రాల్లో నటించి నట కిరీటిగా ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు రాజేంద్రప్రసాద్. అహ నా పెళ్లంట, లేడీస్ టైలర్, అప్పుల అప్పారావు, ఆ ఒక్కటీ అడక్కు, ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్లాం, జయమ్ము నిశ్చయమ్మురా, రాజేంద్రుడు గజేంద్రుడు, మాయలోడు వంటి చిత్రాలతో కామెడీ హీరోగా ఎదిగారాయన. 'ఆ నలుగురు' మూవీ ఆయనలోని మరో కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. డైలాగ్ డెలివరీ, ఎక్స్‌ప్రెషన్స్, టైమింగ్ ప్రేక్షకులని గిలిగింతలు పెట్టేవి. వయసు పెరగడంతో ఆయన తండ్రి, బాబాయ్, మాయయ్య, తాత క్యారెక్టర్లు చేస్తున్నారు. అయితే కొంతకాలంగా నోటిపై అదుపు కోల్పోతున్న ఆయన బహిరంగ వేదికలపై నోటికొచ్చినట్లు మాట్లాడుతూ విమర్శల పాలవుతున్నారు. కొన్నిసార్లు ఏకంగా మద్యం తాగి ఈవెంట్లకు వస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

ఇటీవల జరిగిన సీనియర్ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న రాజేంద్రప్రసాద్ సహ నటుడు అలీపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై అలీ స్పందిస్తూ... రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యలను తాను వ్యక్తిగతంగా తీసుకోవడం లేదని... కొద్ది నెలల క్రితం ఆయన కూతురు చనిపోయిందని.. ఆ బాధలో ఉండటంతోనే అలా మాట్లాడి ఉండొచ్చని అలీ అన్నారు. 'షష్టిపూర్తి' ఈవెంట్లో మాట్లాడుతూ తనపై వస్తున్న విమర్శలపై వివరణ ఇచ్చుకున్న రాజేంద్రప్రసాద్.. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. నేను ఇలాగే ఉంటా.. ఇలాగే మాట్లాడతా.. ఎందుకంటే నేను అందరికంటే పెద్దవాణ్ణి కాబట్టి' అన్నారు.

తాజాగా సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ వివాదంపై రాజేంద్రప్రసాద్ మరోసారి స్పందించారు. జీవితంలో ఎవరినీ ఎప్పుడూ అమర్యాదగా మాట్లాడను. నేను అందరినీ ఎంత బాగా పొగిడాను. ఫుల్ వీడియో చూస్తే మీకే తెలుస్తుంది. ముక్కలు చూస్తే తెలియదు. ఎవడికి కావాల్సిన ముక్కలు వాడు వేసుకుంటే మనమేం చేయలేం. నా కూతురు చనిపోయాక అప్‌సెట్ అయిన మాట వాస్తవమే. ఇందులో బాధ పడాల్సిన విషయం ఏంటంటే.. తిట్టించుకున్న అలీకి లేని బాధ మిగతావాళ్లకు ఎందుకు. అన్నయ్య నన్ను ప్రేమగా ఏదో అన్నాడని అలీ వెంటనే వీడియో రిలీజ్ చేస్తే.. మధ్యలో వాళ్లు తెగ ఫీలైపోయి నన్ను ట్రోల్ చేయడం బాధాకరం' అని వివరణ ఇచ్చారు రాజేంద్రప్రసాద్. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి.

# నా తొడల గురించి రాస్తావా నెటిజన్ కామెంట్‌కి కౌంటర్

సినిమాల్లో కాస్త గ్యాప్ వచ్చినా, సోషల్ మీడియాలో పూనమ్ బజ్వా ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంటుంది. తాజాగా ఓ నెటిజన్ "నీ తొడలు చాలా పెద్దగా ఉన్నాయ్.. దాని మీద జావా కోడ్ రాయొచ్చు" అని కామెంట్ చేయగా.. దీనికి పూనమ్ ఘాటుగా స్పందిస్తూ "నా తొడల గురించి రాస్తావా.. లేక మీద రాస్తావా?" అంటూ కౌంటర్ ఇచ్చింది. మరో కామెంట్‌లో "నువ్వు చిన్న బట్టలు వేసుకుంటావ్" అంటే "ఇంత చిన్న నడుము కవర్ చేయాలంటే పొడుగు బట్టలే వేసుకోవాలి కదా అని బదులిచ్చింది.

తెలుగు ప్రేక్షకులకి పూనమ్ బజ్వా పరిచయం అక్కర్లేని పేరు. ముంబయిలో పంజాబీ కుటుంబంలో పుట్టిన ఈ చిన్నది 'మొదటి సినిమా'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత అక్కినేని నాగార్జున సరసన 'బాస్' చిత్రంలో నటించి మెప్పించింది. అందులో సెకండ్ హీరోయిన్ పాత్రే అయినా మెయిన్ ఫీమేల్ లీడ్ నయనతారని డామినేట్ చేసేసింది. నాగార్జునతో ఆమె చేసే అల్లరి, రొమాన్స్ ప్రేక్షకులకి భ్శాగా నచ్చింది. అందచందాలు పుష్కలంగా ఉన్నా ఎందుకో గానీ ఈ బ్యూటీని తెలుగు నిర్మాతలు పట్టించుకోలేదు. దీంతో కోలీవుడ్‌కి వెళ్లిపోయి.. సేవల్, తెనావట్టు, కచేరి ఆరంభం, ద్రోహి, అరన్మనై 2, గురుమూర్తి.. చిత్రాల్లో నటించి మెప్పించింది. అలాగే మలయాళంలో వెనిసిల్ వ్యాపారి, చైనా టౌన్, శికారి, గ్రేట్ శంకర్ చిత్రాల్లోనూ నటించింది. సినిమాలు ఆఫర్లు తగ్గినా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఫ్యాన్స్‌కి ఎప్పుడూ దగ్గరగానే ఉంటుంది ఈ బ్యూటీ. తన వ్యక్తిగత జీవితం, ప్రయాణాలు, ఫిట్‌నెస్, సినిమాల గురించి అభిమానులతో




షేర్ చేసుకుంటుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా నెటిజన్ల కొంటె ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చింది పూనమ్.

'నీ తొడలు చాలా పెద్దగా ఉన్నాయ్.. దాని మీద జావా కోడ్ రాయొచ్చు' అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. తొడల గురించి రాస్తావా.. తొడల మీద రాస్తావా.. అని కౌంటర్ ఇచ్చింది పూనమ్. నువ్వు అమ్మాయివి.. కోతిచేష్టలు చేయకు.. అని మరొకరు కామెంట్ చేస్తే.. అమ్మాయిని అని గుర్తుచేసినందుకు థ్యాంక్యూ అని ఆన్సర్ ఇచ్చింది. 'నువ్వు ఎప్పుడూ చిన్న బట్టలు వేసుకుంటావ్. అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. ఇంత చిన్న నడుము కవర్ చేసుకోవడం కోసం ఇంత పొడుగు బట్టలేసుకున్నా.. దీనికేమంటావ్ మరి ప్రశ్నించింది పూనమ్. ఆమె కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

సినిమాలు తగ్గడంతో పూనబ్ బజ్వా ఓ డైరెక్టర్‌ని పెళ్లి చేసుకుందని గతంలో వార్తలు గుప్పుమన్నాయి. 'తిక్క' సినిమా ఫంక్షన్లో పూనమ్ బజ్వా తళుక్కుమనడంతో ఆమెకు, ఆ సినిమా డైరెక్టర్ సునీల్‌కు మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని బయటకు వచ్చింది. వీరిద్దరు పెళ్లి చేసుకున్నట్లు వార్తలు వచ్చినా వాటిని పూనబ్ బజ్వా ఖండించింది. సినిమాలు లేకపోయినా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ.. నెటిజన్లతో చిట్‌చాట్‌లు చేస్తూ, విహారయాత్రలకు వెళ్తూ బాగానే ఎంజాయ్ చేస్తోంది ఈ బ్యూటీ.



# మాస్ మహరాజ్ సరసన అషికా రంగనాథ్...



ఆషికా రంగనాథ్ తెలుగులో మరో క్రేజీ ఛాన్స్ వచ్చిందని టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'నను శైలజ', 'ఉన్నది ఒకటే జిందగీ', 'చిత్రలహరి', 'రెడ్' చిత్రాల దర్శకుడు కిషోర్ తిరుమల మాస్ మహరాజ్ రవితేజతో ఓ మాస్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. 'అనార్కలి' అనే టైటిల్ పరిశీలనలో ఉండగా, ఈ చిత్రానికి ఇద్దరు కథానాయికలు అవసరం. కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఆషికా రంగనాథ్ తెలుగులో స్పీడ్ పెంచుతోంది. 2016లో 'క్రేజీ బాయ్' అనే కన్నడ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'రాంబో 2', 'మధగజ', 'రేయ్మో' వంటి సినిమాలతో అక్కడ క్రేజీ హీరోయిన్‌గా ఎదిగింది.

తెలుగు ఇండస్ట్రీలోకి కల్యాణ్‌రామ్ సరసన 'అమిగోస్' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆషికా గతేడాది సంక్రాంతికి నాగార్జునతో 'నా సామి రంగ'తో హిట్ కొట్టింది. తమిళంలో 'పట్టత్తు అరసన్', 'మిస్ యూ' వంటి చిత్రాల్లో కనిపించిన ఈ బ్యూటీ గ్లామర్‌తో పాటు నటనలోనూ మెప్పిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్న ఆషికా తెలుగు, తమిళ ప్రేక్షకుల్లోనూ మంచి ఫాలోయింగ్ తెచ్చుకుంటోంది. తన డాన్సింగ్ స్కిల్స్, స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆమె క్రేజ్ మరింత పెరుగుతోంది. ప్రస్తుతం తెలుగులో చిరంజీవి సరసన 'విశ్వంభర'లో కీలక పాత్రలో నటిస్తోంది. తాజాగా ఈ బ్యూటీకి మరో క్రేజీ ఆఫర్ వచ్చినట్లు టాక్ నడుస్తోంది. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, చిత్రలహరి, రెడ్... చిత్రాలతో పేరు తెచ్చుకున్న కిషోర్ తిరుమల.. మాస్ మహరాజ్‌తో ఓ ప్రాజెక్ట్ చేయనున్నాడు. దీనికి 'అనార్కలి' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు నటించాల్సి ఉంది. దీనికోసం 'డ్రాగన్' బ్యూటీ కయాదు లోహర్, 'ప్రేమలు' హీరోయిన్ మమితా బైజు పేర్లు వినిపించినప్పటికీ ఫిక్స్ కాలేదు. అయితే ఇటీవల 'సింగిల్'తో హిట్టు కొట్టిన భారీ అందాల భామ కేతిక శర్మని ఓ హీరోయిన్‌గా తీసుకున్నట్లు సమాచారం. మరో హీరోయిన్ పాత్రకు ఆషికా రంగనాథ్ పేరు పరిశీలనలో ఉందట. దాదాపు ఆమె పేరు ఫిక్స్ అయిపోయినట్లేనని తెలుస్తోంది. కిషోర్ తిరుమల చిత్రాల్లో హీరోయిన్ల క్యారెక్టర్లకు ప్రాధాన్యత ఉంటుంది. ఆ తరహాలోనే ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లకు అధిక ప్రాధాన్యత ఉండబోతోందట. జులై తర్వాత ఈ ప్రాజెక్టు సెట్స్ మీదికి వెళ్లనుందట. ప్రస్తుతం తెలుగులో కన్నడ భామల హవా నడుస్తోంది. రష్మిక మందానా, రష్మిక మందానా, శ్రద్ధా శ్రీనాథ్, నభా నటేష్ లాంటి వారు మలయాళ బ్యూటీలకు పోటీనిస్తూ వరు అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. ఆషికా రంగనాథ్ కూడా చేరింది.



# ఎన్టీఆర్ అలా.. ప్రభాస్ ఇలా

మాస్ పల్స్ తెలిసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్ బర్త్ డే (జూన్ 4) సందర్భంగా సోషల్ మీడియాలో అతని ఫ్యాన్స్, టాలీవుడ్ ఆడియెన్స్ సందడి చేస్తున్నారు. ఇక తాజాగా ఎన్టీఆర్, ప్రభాస్ వేసిన పోస్టులు, నీల్‌కు బర్త్ డే విషెస్ చెప్పిన తీరుకు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఇక ఇందులో ప్రభాస్ నుంచి సలార్ 2 గురించి మాట అయితే వచ్చింది. నా సలార్ అంటూ ప్రశాంత్ నీల్‌కు ప్రభాస్ బర్త్ డే విషెస్ చెప్పారు. ఇక సలార్ 2 కోసం ఎంతో వెయిట్ చేస్తున్నాను అని ప్రభాస్ చెప్పారు. సెట్‌లోనే స్క్రీనింగ్ ఏర్పాటు చేసి నైట్ అంతా మ్యాచ్ వీక్షించారు. ఇక బెంగళూరు టీం గెలవడంతో ప్రశాంత్ నీల్ తెగ సంబరపడిపోయారు. అనంతరం అక్కడే తన బర్త్ డేకు సంబంధించిన సెలెబ్రేషన్స్ నిర్వహించారు. అక్కడే ఎన్టీఆర్ సమక్షంలోనే కేక్ కట్ చేసినట్టుగా కనిపిస్తోంది.

సలార్ 2 కోసం వెయిటింగ్ అంటూ ప్రభాస్ బర్త్ డే విషెస్ చెబితే.. నీ మాటల కన్నా చేతలే ఎక్కువ మాట్లాడాతాయ్.. ఇంకా స్క్రీన్‌పై అగ్గి రాజేసేస్తూనే ఉంటావ్ అంటూ ఎన్టీఆర్ విషెస్ చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్టుతో ఈ ఇద్దరూ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా నీల్ మంచి అప్డేట్ ఇవ్వాలని అనుకున్నారు. కానీ వార్ 2 కోసం నీల్ తన అప్డేట్‌ను వాయిదా వేసుకున్న సంగతి తెలిసిందే. చివరకు ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా వార్ 2 టీజర్ దేశ వ్యాప్తంగా ట్రెండ్ అయింది.

ప్రస్తుతం ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్ రెండో షెడ్యూల్ శరవేగంగా జరుగుతున్నట్టుగా సమాచారం. గత నెలలోనే మొదటి షెడ్యూల్‌ను ఫినిష్ చేసింది టీం. ఆ తరువాత కొన్ని రోజులు సమ్మర్ వెకేషన్ అన్నట్టుగా గ్యాప్ ఇచ్చారు. మళ్లీ రీసెంట్‌గానే రెండో షెడ్యూల్‌ను స్టార్ట్ చేశారని తెలుస్తోంది. ఇంత వరకు నీల్ తన హీరోయిన్ గురించి అప్డేట్ ఇవ్వలేదు. ఇందులో రుక్మిణి వసంత్ హీరోయిన్ అని అంతా రాసేసుకుంటున్నారు. సరైన టైం చూసి మాస్ మిస్సైల్‌ను వదులుతామని ఎన్టీఆర్ నీల్ టీం ప్రకటించిన సంగతి తెలిసిందే.



# నాలుగు కోట్లు వెనక్కి ఇచ్చిన సిద్దు జొన్నలగడ్డ?

సిద్దు జొన్నలగడ్డ తాజాగా నెట్టింట్లో ట్రెండ్ అవుతున్నారు. జాక్ మూవీతో అతి ఘోరమైన పరాజయాన్ని చవి చూశాడు. టిల్లుతో వంద కోట్లు కొల్లగొట్టిన సిద్దు జొన్నలగడ్డ.. జాక్‌తో కనీసం పది కోట్ల షేర్‌ను కూడా రాబట్టలేకపోయాడు. అలా చివరకు వంద కోట్ల హీరో అని సిద్దు జొన్నలగడ్డ మీదున్న మార్క్‌పైనే అందరికీ అనుమానం వచ్చేసింది. కనీస వసూళ్లను కూడా సాధించలేక జాక్ చతికిల పడిన సంగతి తెలిసిందే. అయితే నిర్మాతను కాస్త ఆదుకునేందుకు సిద్దు తన రెమ్యూనరేషన్‌లోంచి నాలుగు కోట్లు వెనక్కి ఇచ్చినట్టుగా తెలుస్తోంది.

సిద్దు జొన్నలగడ్డ టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలతో అందరినీ ఆకట్టుకున్నాడు. దీంతో సిద్దు మీద మంచి ఒపీనియన్ ఏర్పడింది. సిద్దు క్రౌడ్ పుల్లర్.. మినిమం గ్యారెంటీ అని అంతా అనుకున్నారు. కానీ జాక్ సినిమాతో సిద్దు మాత్రం కనీస స్థాయిలో కూడా మెప్పించలేకపోయారు. సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా కూడా మినిమం వసూళ్లు తెప్పిస్తుంటారు మన హీరోలు. కానీ సిద్దు మాత్రం జాక్ మూవీతో పూర్తిగా బోల్తా కొట్టేశారు. ఇక ఆయన పాత సినిమా కృష్ణ అండ్ హిజ్ లీలను కూడా మళ్లీ థియేటర్లోకి తీసుకు వచ్చారు. కానీ అలా వచ్చినట్టుగా కూడా ఎవ్వరికీ తెలియకుండానే పోయింది ఆ చిత్రం.

జాక్ మూవీతో సిద్దు మార్కెట్ మీదే అందరికీ అనుమానం వచ్చేసింది. బాక్సాఫీస్ వద్ద జాక్ ఘోరంగా దెబ్బ కొట్టేసింది. బీవీఎస్ఎన్ ప్రసాద్‌కు ఎప్పుడో ఇచ్చిన కమిట్మెంట్‌ను జాక్ చిత్రంతో సిద్దు పూర్తి చేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ మూవీని చేసినా.. ఇప్పుడు తన మార్కెట్ ప్రకారం భారీ రెమ్యూనరేషన్ తీసుకున్నట్టుగా సమాచారం. టిల్లు ఫ్రాంచైజీతో వంద కోట్ల హీరో అనే ఫేమ్‌తో సిద్దు ఉన్నారు. దానికి తగ్గట్టుగానే జాక్ కోసం మంచి అమౌంట్‌నే (8 కోట్లు అని సమాచారం) తీసుకున్నారని తెలుస్తోంది.

ఇదే విషయాన్ని మీడియా అడిగినప్పుడు.. అప్పటి లెక్కల్ని చూసి రెమ్యూనరేషన్ తీసుకోలేను కదా.. ఇప్పుడున్న మార్కెట్‌ను బట్టే తీసుకుంటాను అని సిద్దు సమాధానం చెప్పారు. అయితే జాక్ మూవీ కనీస వసూళ్లను కూడా సాధించలేకపోవడంతో నిర్మాతకు కోట్లలో నష్టం వచ్చినట్టుగా సమాచారం. దీంతో బాధ్యత కలిగిన సిద్దు తాను తీసుకున్న రెమ్యూనరేషన్‌లోంచి నాలుగు కోట్లు వెనక్కి ఇచ్చినట్టుగా తెలుస్తోంది. మన హీరోల్లో చాలా మంది ఇలా కష్టాల్లో, నష్టాల్లో నిర్మాతలకు తోడుగా నిలుస్తారన్న సంగతి తెలిసిందే. తాజాగా సిద్దు సైతం ఇలా తన మంచితనాన్ని, గొప్ప మనసును చాటుకున్నారని అంతా అంటున్నారు. ప్రస్తుతం సిద్దు ఓ ట్రయాంగిల్ లవ్ స్టోరీ 'తెలుసు కదా'తో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్మెంట్ వీడియోని వదిలారు. ఆ వీడియోని చూస్తే సినిమాలో సిద్దు, రాశీ, శ్రీనిధి కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలిసిపోయింది. దీపావళి సందర్భంగా ఈ మూవీని అక్టోబర్ 17న థియేటర్లోకి తీసుకు రాబోతోన్నారు. చూస్తుంటే సిద్దు సైతం ఓ డిఫరెంట్ లుక్‌ను ట్రై చేస్తున్నారు. తన ప్రస్తుత ప్రాజెక్ట్ కోసం ఇలా డిఫరెంట్ లుక్‌ను మెయింటైన్ చేస్తున్నాడని అంతా అనుకుంటున్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.